E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 03-08-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



'హాజరే కాదు.. ప్రతిభనూ పరిగణనలోకి తీసుకోండి'
» 3లో

యూపీఐలో కొత్త మార్పులు వచ్చేశాయ్.. » 4లో




ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు.. పట్టు బిగిస్తున్న భారత్.. టీ బ్రేక్ » 6లో




ప్రేమ రూమర్స్.. సీక్రెట్‌గా మూవీ చూసిన రష్మిక » 5లో



ట్రంప్ టారిఫ్ ప్రభావం మనపై ఉంటుందా.. ఉండదా? » 4లో



# క్రీడల అభివృద్ధికి.. 9 ఒప్పందాలు

» క్రీడాకారుల ప్రదర్శన విశ్లేషణ, గాయాల పాలవకుండా ప్రత్యేక వ్యవస్థ
» గురుకుల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ
» 'స్పోర్ట్స్ కాన్‌క్లేవ్'లో ఒప్పందాలు
» క్రీడల్లో ప్రపంచంతో పోటీ పడతాం
» క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించేందుకు స్పోర్ట్స్ హబ్ బోర్డు: సీఎం రేవంత్‌రెడ్డి




రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం తొమ్మిది కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణతోపాటు క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు వీలుగా చర్యలు చేపట్టనుంది.

తరువాయి 2లో

# లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై అణు బాంబులాంటి ఆధారాలున్నాయ్

» 70 నుంచి 100 స్థానాల్లో గోల్‌మాల్‌పై అనుమానాలు
» త్వరలోనే వాటిని బయటపెడతాం
» ఆ అక్రమాల వల్లే ప్రధాన మంత్రి సీట్లో మోదీ
» కాంగ్రెస్ న్యాయవాదుల విభాగం సదస్సులో రాహుల్ గాంధీ



తరువాయి 3లో

# స్వదేశీ ఉత్పత్తులతో దేశ సేవ.. ప్రధాని మోదీ పిలుపు



» మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నాం
» ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు ప్రధాని మోదీ కౌంటర్
» అస్థిరంగా ప్రపంచ పరిస్థితులు.. అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది
» ప్రతి దేశమూ స్వలాభం కోసమే.. స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి పెడదాం: మోదీ
» మాపై దాడికి తెగిస్తే పాతాళంలో ఉన్నా వదలం.. పాక్‌కు హెచ్చరిక

భారత్, రష్యాలది డెడ్ ఎకాకమీ' అంటూ పరుష వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, ఆయనను సమర్థించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ప్రధాని మోదీ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు.

తరువాయి2లో

# గోదావరిలో మిగులు జలాల్లేవు



» ఉంటే అన్ని రాష్ట్రాలకు సమాన వాటా
» సముద్రంలోకి వెళ్లే నీళ్లన్నీ తమవే అనుకుంటే ఎలా?: ఉత్తమ్

ఈ కబురు,హైదరాబాద్: గోదావరిలో మిగులు/వరద జలాలు లేవని.. ఒకవేళ ఉంటే గనక ఆ నీటిపై నదిని పంచుకునే అన్ని రాష్ట్రాలకు సమానవాటా ఉంటుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సముద్రంలోకి వృ ఉధాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుకుంటామని, అందులో తప్పేముంది? అంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను ఉత్తమ్ తప్పుబట్టారు. సముద్రంలోకి

» 3లో

# మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు

» 21లోపు ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయండి.. నోటిసులు ఇవ్వండి
» కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో పోలీసులకు నాంపల్లి కోర్టు ఆదేశం
» రాజకీయాల్లో విషం చిమ్మేవారికి ఇది గుణపాఠం: కేటీఆర్
» కేసులు, కొట్లాటలు కొత్త కాదు.. న్యాయవ్యవస్థపై గౌరవం ఉంది: సురేఖ



తరువాయి3లో

# జూరాల, శ్రీశైలం మధ్య ప్రాజెక్టు నిర్మిస్తే కృష్ణా జలాల

» భారత రాష్ట్ర సమితి కట్టింది ఒక్క కాళేశ్వరమే
» అది కుంగిపోయి.. కూలిపోయింది
» కొల్లాపూర్ సభలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ఈ కబురు, నాగర్‌కర్నూల్- కోడేరు: జూరాల, శ్రీశైలం జలాశయాల మధ్య ఒక ప్రాజెక్టు నిర్మిస్తే కృష్ణా జలాలు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

తరువాయి2లో

# నువ్వు లేపేస్తా అంటే.. ఇక్కడ ఉన్నది సీబీఎన్

» రప్పా, రప్పా ఏమిటో ప్రజలు ఆలోచించాలి
» నా 49 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నాయకుడిని, పార్టీని చూడలేదు
» జగన్, ఆ పార్టీ నేతలపై చంద్రబాబు ఫైర్



*49 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నా.. నా అనుభవంలో ప్రస్తుతం ఉన్నంత దారుణ పరిస్థితి ఎన్నడూ చూడలేదు. రాజకీయమంటే మనల్ని చూసి పది మంది నేర్చుకోవాలి.*

తరువాయి 3లో

# ఢిల్లీ యాత్రల్లో రేవంత్ అర్ధ శతకం: కేటీఆర్



» 3లో

# 75 ఏళ్ల నిబంధన మోదీకి వర్తించదా?



» కుర్చీ వదలాలన్న భాగవత్ మాట పట్టదా?
» ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా మోదీ వినడం లేదు
» రాహుల్ గాంధీయే ఆయనను దించేస్తారు
» ఈసారి బీజేపీకి 150 సీట్లు దాటనివ్వం
» తెలంగాణ కులగణన దేశానికే మోడల్
» కాంగ్రెస్ న్యాయసదస్సులో సీఎం రేవంత్

ఈ కబురు,న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్లు నిండినవారు కుర్చీ వదలాలన్న ఆర్ఎస్ఎస్ నిబంధన మోదీకి వర్తించదా? అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ మాటను మోదీ వినడంలేదని, వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీయే ఆయనను కుర్చీ నుంచి దించేస్తారని అన్నారు. ఈసారి బీజేపీకి 150 సీట్లు దాటనివ్వబోమని ప్రకటించారు. మోదీని ఓడించేందుకు, ఆయనను కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయని చెప్పారు. శనివారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ సవాళ్లు: దృక్పథం, మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన కాంగ్రెస్ వార్షిక న్యాయసదస్సులో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "

తరువాయి 2లో

# బీజేపీని బద్నాం చేయడానికి కుట్ర



» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలు
» రాహుల్ మెప్పు కోసమే స్థాయికి మించి మాటలు
» సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
» బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటూ మహాధర్నా

ఈ కబురు,కవాడిగూడ/హైదరాబాద్: బీజేపీని బద్నాం చేయడానికే సీఎం రేవంత్ ఢిల్లీ వెళుతున్నారని, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని, అందులో ముస్లింలకు ప్రతిపాదించిన 10శాతాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం చేతగాని రేవంత్.. కేంద్రంపై నిందలు మోపుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌కు ఢిల్లీ వెళ్లడం అలవాటేనని, కానీ.. ఆయనకు రాహుల్ అపాయింట్‌మెంట్ మాత్రం దక్కడం లేదని ఎద్దేవా చేశారు.

తరువాయి3లో

# బీసీ రిజర్వేషన్ల సాధనకు.. జాగృతి 72 గంటల నిరాహార దీక్ష



» 3లో

మొదటి పేజీ తరువాయి

# క్రీడల అభివృద్ధికి.. 9 ఒప్పందాలు




ఈ కబురు, హైదరాబాద్:రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం తొమ్మిది కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణతోపాటు క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు వీలుగా చర్యలు చేపట్టనుంది. గురుకులాల్లోని విద్యార్థులను జల్లెడపట్టి ప్రతిభావంతులను ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ అందించనుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన స్పోర్ట్స్ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచ క్రీడా రంగంతో పోటీపడేలా ఈ పాలసీని రూపొందించామని తెలిపారు. ఈ పాలసీ కాగితాలపై మాత్రమే కనిపించేది కాదని, తెలంగాణకు బంగారు రేఖగా మారుతుందని చెప్పారు. ప్రపంచ క్రీడా రంగంలో ప్రభావం చూపాలంటే.. దేశ క్రీడా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఆయన చెప్పారు. ఆ మార్పు తెలంగాణ నుంచే మొదలవనుందన్నారు. రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధి కోసం ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వ అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తామని తెలిపారు. యంగ్ ఇండియా యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటుకు సహకరించేందుకు క్రీడా రంగ ప్రముఖులు, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు.

**స్పోర్ట్స్ గవర్నింగ్ బోర్డు ఏర్పాటు..**

క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించేందుకు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెంచేందుకు స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ బోర్డును ఏర్పాటు చేసినట్టు సీఎం రేవంత్ తెలిపారు. దీనికి సంజీవ్ గోయెంకా చైర్‌పర్సన్‌గా, కొణిదెల ఉపాసన కోచైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రముఖ క్రీడాకారులు కపిల్‌దేవ్, బైచుంగ్ భూటియా, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, అభినవ్ బింద్రా, హైదరాబాద్ సన్‌రైజర్స్ క్రికెట్ జట్టు యజమాని కావ్యమారన్ తదితరులు ఈ బోర్డులో సభ్యులుగా, మార్గదర్శకులుగా ఉంటారని వివరించారు. కాగా, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ కోసం కొరియా క్రీడా విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో గత పదేళ్లలో క్రీడా మైదానాలు సన్‌బర్న్ ఈవెంట్లు, ఇతర వేడుకలకు ఫంక్షన్ హాళ్లుగా మారిపోయాయని విమర్శించారు. సరైన క్రీడా పాలసీ లేకనే యువత పెడదారి పడుతోందన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడా ప్రముఖులు అభినవ్ బింద్రా, అనిల్ కుంబ్లే, గగన్ నారంగ్, అంజూ బాబీ జార్జ్, రవికాంత్‌రెడ్డి, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**తొమ్మిది ఒప్పందాలు ఇవే**

హైదరాబాద్‌లో ఫిఫా సాకర్ అకాడమీ ఏర్పాటు కోసం జాతీయ ఫుట్‌బాల్ సంఘంతో ఒప్పందం.

రాష్ట్ర షూటర్లకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ఒలింపియన్ షూటర్ గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ (జీఎఫ్‌జీ) ఫౌండేషన్'తో ఒప్పందం. హెచ్‌సీయూలోని శాట్ షూటింగ్ రేంజ్‌ను ప్రభుత్వం ఆధునికీకరిస్తుంది. శాట్ ప్రతిపాదించిన 20 మంది షూటర్లకు జీఎఫ్‌జీ అత్యాధునిక శిక్షణ ఇస్తుంది.

**రాష్ట్రంలో షూటింగ్ అభివృద్ధి కోసం గగన్ నారంగ్ మెంటార్‌గా వ్యవహరిస్తారు. ప్రతిభావంతులైన షూటర్ల గుర్తింపు, శిక్షణను పర్యవేక్షిస్తారు.**

బ్యాడ్మింటన్ మెంటార్‌గా నియమితులైన పుల్లెల గోపీచంద్.. ప్రతిభావంతులైన షట్లర్ల గుర్తింపు, శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

'స్పోర్ట్స్ సైన్స్ సెంటర్‌అథ్లెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' కోసం ఒలింపియన్ అభినవ్ బింద్రాకు చెందిన 'అభినవ్ బింద్రా టార్గెటింగ్ పెర్ఫామెన్స్ (ఏబీటీపీ)'తో ఒప్పందం క్రీడాకారుల ప్రదర్శన విశ్లేషణ, గాయాల బారిన పడకుండా చర్యలు, త్వరగా కోలుకునేందుకు అవసరమైన వ్యవస్థ ఏర్పాటుకు ఏబీటీపీ సహకారం అందిస్తుంది. గురుకులాల్లో క్రీడాకారులకు శిక్షణ, క్రీడా సామగ్రి అందించేందుకు కూడా ఈ సంస్థతో ఒప్పందం జరిగింది.

క్రీడాకారుల్లో ఆత్మ స్థైర్యం, విశ్వాసం పెంపు, ఇంగ్లిష్ భాష, డిజిటల్ అక్షరాస్యతపై పట్టు కల్పించేందుకు ఆస్పైర్ సంస్థతో ఒప్పందం.

'బాస్కెట్‌బాల్ హైపెర్ఫామెన్స్ కోచింగ్ ప్రోగ్రాం' నిర్వహణ కోసం స్పోర్ట్‌జ్‌ప్రీ కంపెనీతో ఒప్పందం. ఈ క్రీడలో సబ్ జూనియర్ నుంచి సీనియర్ల వరకు శిక్షణ ఇస్తారు.

అథ్లెటిక్స్, కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, వాలీబాల్ క్రీడాంశాల్లో గురుకుల విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు అనిల్ కుంబ్లేకు చెందిన టెన్‌విక్ సంస్థతో ఒప్పందం. సుమారు లక్షా 50 వేల మంది విద్యార్థులను పరీక్షించి, ప్రతిభావంతులను గుర్తిస్తారు.

**ఐదుగురు క్రీడాకారులకు చెక్కులు**

స్పోర్ట్స్ కాన్‌క్లేవ్ సందర్భంగా ఐదుగురు క్రీడాకారులకు ఆర్థిక సాయం చెక్కులను సీఎం అందజేశారు. హెప్టాథ్లాన్ క్రీడాకారిణి అగసర నందినికి రూ.5 లక్షలు, జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్‌కు రూ.3 లక్షలు, షూటర్ ధనుష్‌శ్రీకాంత్‌కు రూ.10 లక్షలు, గోల్‌బాల్ క్రీడాకారులు పవన్ కల్యాణ్, సాయితేజకు చెరో రూ.2 లక్షల 40 వేలు అందజేశారు.

మొదటి పేజీ తరువాయి

# స్వదేశీ ఉత్పత్తులతో దేశ సేవ.. ప్రధాని మోదీ పిలుపు



ఈ కబురు,వారాణసీ: 'భారత్, రష్యాలది డెడ్ ఎకాకమీ' అంటూ పరుష వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, ఆయనను సమర్థించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ప్రధాని మోదీ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని స్పష్టంచేశారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ విధానాలపై దృష్టి సారించాల్సి ఉన్నదని ఆయన అన్నారు. విపక్షాలు సైతం రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, స్వదేశీ ఉత్పత్తులకు ఉమ్మడి ప్రచారం కల్పించాలని ప్రధాని కోరారు. భారత్‌పై దాడికి తెగిస్తే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, ఒకవేళ పాతాళంలో దాక్కున్నా వెతికి పట్టుకుంటామంటూ.. దాయాదిదేశం పాకిస్థానపై తీవ్రస్వరం వినిపించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని జీర్ణించుకోవడం కొంతమందికి కష్టంగా ఉన్నదంటూ విపక్షాలపై విరుచుకుపడ్డారు. మోదీ తన సొంత నియోజకవర్గం యూపీలోని వారాణసీలో శనివారం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే పీఎం కిసాన్ యోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తూ ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలతోపాటు ఆపరేషన్ సిందూర్, మహాదేవ్‌లపై విపక్షాల విమర్శలను కూడా ఈ సందర్భంగా మోదీ తిప్పికొట్టారు. "ప్రపంచ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాలనే చూసుకుంటోంది. మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తున్న వేళ మన ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దేశంకోసం ఏది ఉత్తమమో దాన్నంతా ప్రభుత్వం చేస్తోంది." అని మోదీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు.

**ముహూర్తం చూస్తామా?**

కాంగ్రెస్, ఇతర విపక్షాలు పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను కూల్చడంపై కలత చెందుతున్నాయని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. "పహల్గాం దాడి హంతకులను పార్లమెంటు సమావేశాలప్పుడే ఎన్‌కౌంటర్ ఎలా చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదులను చంపడానికి ముహూర్తం చూస్తామా? దొరికినప్పుడు చంపకుండా వదిలేస్తామా.?" అంటూ ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. "తన ఎదుట అన్యాయం, ఉన్మాదం జరుగుతుంటే మహాదేవుడు రౌద్రరూపం దాల్చుతారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం ఇదే రూపాన్ని చూసింది. భారత్‌తో పెట్టుకుంటే ఎవరినీ వదిలిపెట్టం. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్‌లోని వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలోనే ఉన్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణులు దాయాదికి నిద్రను దూరంచేశాయి. ఈ క్షిపణులను ఇకపై యూపీలోనే తయారుచేయబోతున్నాం. లఖనవూలో ఉత్పత్తిని ప్రారంభించనున్నాం. అయితే, కొంతమందికి ఆపరేషన్ సిందూర్ విజయం రుచించకపోవడం దురదృష్టకరం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మాత్రం పాక్ దుస్థితిని చూసి తట్టుకోలేకపోతున్నాయి. ఉగ్రవాదుల పరిస్థితి చూసి అక్కడ పాక్, ఇక్కడ ఈ రెండు పార్టీలూ రోదిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను 'తమాషా'గా తూలనాడుతూ, మన బలగాల శౌర్యప్రతాపాలను కాంగ్రెస్, ఎస్పీ నేతలు పదేపదే కించపరుస్తున్నారు" అని మోదీ మండిపడ్డారు.

**రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు**

వారాణసీ, ఆగస్టు 2 : పీఎం కిసాన్ యోజన కింద దేశవ్యాప్తంగా ఉన్న 9.70 కోట్లమంది రైతుల ఖాతాల్లో రూ.20,500 కోట్ల నిధులను ప్రధాని మోదీ జమ చేశారు. ఇది 20వ విడత సాయం. శనివారం తన సొంత నియోజకవర్గం వారాణసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నిధులను ఆయన విడుదల చేశారు. పీఎం కిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 2019లో మోదీ ప్రారంభించారు. ఇప్పటివరకు అన్నదాతల ఖాతాల్లో 3.90 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. కాగా, వారాణసీ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా రూ.రెండు వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. 2014లో ఇక్కడినుంచి మోదీ పార్లమెంటుకు తొలిసారి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 51 సార్లు తన నియోజకవర్గాన్ని ఆయన సందర్శించారని బీజేపీ రైతు విభాగం అధ్యక్షుడు దిలీప్ పటేల్ వివరించారు.

# మోదీ చేతిలో ఈసీ తోలుబొమ్మ: ఖర్గే



**ఈ కబురు, దిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల్లో భాజపాకు 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగ మూలస్వరూపాన్నే మార్చేసే వారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ప్రచారసభలతో ప్రజలను చైతన్యపరచడం ద్వారా వారికి ఆ భారీ విజయం దక్కకుండా చేసిన ఘనత రాహుల్ గాంధీదేనని తెలిపారు. దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శనివారం జరిగిన న్యాయవాదుల సదస్సులో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ చేతిలో తోలుబొమ్మలా ఈసీ మారింది. ప్రత్యేక ముమ్మర సవరణ పేరుతో బిహార్‌లో లక్షల మంది పేదలను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఇదే చేయబోతున్నారు' అని ఖర్గే ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పంపిన సందేశాన్ని సదస్సులో చదివి వినిపించారు.**

**మండుతున్న ఎండలు...**

**రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. పగటి పూట తీవ్ర ఉక్కపోతతో కూడిన వాతావరణం... రాత్రిపూట సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో భాగంగా ద్వితీయార్థం ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉండగా... ప్రస్తుతం అధికంగా నమోదవుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఈ నెలలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదవుతాయని, రాత్రిపూట మాత్రం సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని సూచించింది.**

**నైరుతి సీజన్లో ఆగస్టు 1 వరకు 36.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 34.24 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మూడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా... 24 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 6 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.**

మొదటి పేజీ తరువాయి

# 75 ఏళ్ల నిబంధన మోదీకి వర్తించదా?

"2001లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇప్పటివరకు కుర్చీని నరేంద్రమోదీ వదలడం లేదు. ఆర్ఎస్ఎస్ చెప్పినా ఆయన వినడం లేదు. రెండు నెలల క్రితమే ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్లు నిండినవారు కుర్చీ వదలాలని చెప్పారు. అయినా.. మోదీ అందుకు సిద్ధంగా లేరు. అడ్వాణీ, మురళీ మనోహర్ జోషికి వర్తించే నిబంధనలు మోదీకి వర్తించవా? మోదీని కుర్చీ నుంచి ఆర్ఎస్ఎస్, వాజపేయి దింపలేకపోయారు. వాళ్లతో కానిది మనం చేసి చూపిద్దాం. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీయే మోదీని కుర్చీ నుంచి దింపేస్తారు. మోదీ లేకుంటే బీజేపీకి 150 సీట్లు కూడా రావని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే అన్నారు. దూబే నీ డైరీలో రాసి పెట్టుకో. బీజేపీకి 150కి మించి ఒక్క సీటు కూడా రానివ్వం" అని రేవంత్ అన్నారు. రాహుల్‌గాంధీ అనుకుంటే 2004లోనే కేంద్ర మంత్రి, 2009లోనే ప్రధానమంత్రి అయ్యేవారని గుర్తు చేశారు. కానీ, ఆ రెండింటినీ ఆయన త్యాగం చేశారని తెలిపారు. త్యాగాలు కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, సామాన్య కార్యకర్తగానే రాహుల్ కొనసాగుతున్నారని గుర్తుచేశారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీల కోసం, సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా రాహుల్ గాంధీ పోరాడుతున్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉందని, బ్రిటిష్‌వాళ్లతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఈ విషయాన్ని బీజేపీ వాళ్లకు గుర్తు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ మినహా.. బీజేపీ, బీఆర్ఎస్, జేడీ, బీజేడీ, ఆర్జేడీ సహా ఇతర పార్టీలన్నీ స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని గుర్తు చేశారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయని, కానీ.. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం గురించి ఆయన ఆలోచించడం లేదని ఆరోపించారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని తెలిపారు.



**కాంగ్రెస్ త్యాగాల పార్టీ..**

ఇందిరాగాంధీ పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించి..రెండు ముక్కలు చేసి.. కాళీమాతగా గుర్తింపు పొందారని రేవంత్ అన్నారు. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని ఇందిరాగాంధీ రక్షించారని, ఆ క్రమంలో ఆమె ప్రాణాలనూ త్యాగం చేశారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో రాజీవ్‌గాంధీ కూడా అమరత్వం పొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏం చేసిందని పదే పదే బీజేపీ వాళ్లు ప్రశ్నిస్తున్నారని, ఈ దేశం కోసం గాంధీజీ, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. 2004లో కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని సోనియాగాంధీని అందరూ కోరినా.. ఆమె దానిని త్యాగం చేసి మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారని తెలిపారు. రాష్ట్రపతిగా అవకాశం వచ్చినా వదులుకొని ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతిని చేశారని పేర్కొన్నారు. ఇక దేశంలో సామాజిక న్యాయం, కులగణన కోసం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు నూతన సామాజిక న్యాయ సాధనకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాడతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. భారత్ జోడో యాత్ర సమయంలో తెలంగాణలో కుల గణనపై రాహుల్ ఇచ్చిన హామీ మేరకు తాము కులగణన చేశామని, దేశానికి మోడల్‌గా ఇచ్చామని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# బీజేపీని బద్నాం చేయడానికి కుట్ర

కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలోనూ బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీసీల హక్కులను మజ్లిస్ హరిస్తుంటే, కాంగ్రెస్ కాలరాస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ నుంచి బీసీలను దూరం చేసేందుకే కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. "బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు తెచ్చింది మీరు.. అమలు చేయాల్సిన బాధ్యత కూడా మీదే.. మాపై రాళ్లేయడం ఏంటి? కేంద్రంలో 27 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా ఐదు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులు ఉన్నారు.. మీ హయాంలో ఒక్క బీసీనైనా సీఎంను చేశారా?" అని కాంగ్రెస్‌ను నిలదీశారు. రాహుల్ మెప్పు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... విశ్వబ్రాహ్మణులు కన్వర్టెడ్ బీసీలా? లంబాడాలు కన్వర్టెడ్ ఎస్టీలా?.... సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు.దశాబ్దాల తరబడి అధికారంలో ఉండి.. బీసీ గణన చేయనందుకు పార్లమెంట్ ఎదుట రాహుల్‌గాంధీ ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. రాహుల్, కేసీఆర్ ఎప్పుడూ పరస్పరం విమర్శలు చేసుకోరని, బీఆర్ఎస్ వాళ్లు ఎప్పుడైనా తమ వద్దకే వస్తారన్నది రాహుల్ నమ్మకమని తెలిపారు. "రాష్ట్రంలో ఏం మార్పు వచ్చింది? అవినీతిలోనా? మోసం చేయడంలోనా?... తెలంగాణ ఎందులో ఆదర్శం? మతపరమైన రిజర్వేషన్ల అమలులోనా? బీసీల గొంతుకోయడంలోనా?.. ఈ ప్రశ్నలకు రాహుల్, రేవంతే సమాధానం చెప్పాలి. బీసీలకు వ్యతిరేకంగా రాహుల్, రేవంత్ కుట్ర పన్నుతున్నారు" అని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో సాగిన దందాలు.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముస్లింలకు ప్రతిపాదించిన 10శాతం తొలగించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించారు. రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. 20నెలలు దాటిపోయినా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీసీల కళ్లల్లో మట్టికొట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని మోదీ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు పదిశాతం రిజర్వేషన్లు ఎత్తివేసి, బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్ఎస్ బీసీలను మోసం చేసిందని, ఇప్పుడు అదే దారిలో కాంగ్రెస్ నడుస్తుందన్నారు. ధర్నాలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# ఢిల్లీ యాత్రల్లో రేవంత్ అర్ధ శతకం: కేటీఆర్



హైదరాబాద్, ఈ కబురు: ఢిల్లీ యాత్రల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్ధ శతకం కొట్టారు తప్ప రాష్ట్రానికి నయా పైసా లాభం చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 50సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారో చెప్పే దమ్ముందా..? అని ప్రశ్నించారు. ఢిల్లీ యాత్రలతో రాష్ట్రానికి సాధించింది ఏమిటో రేవంత్‌రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని కేటీఆర్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఢిల్లీ బాసుల కాళ్ల దగ్గర తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు.

బనకచర్లతో మన వ్యవసాయ రంగం పెను సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలంగాణ తల్లడిల్లుతుంటే.. రేవంత్ మాత్రం గురువు చంద్రబాబుకు వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో నీళ్లు రాక రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే.. సీఎంకు కనీస పట్టింపు లేదన్నారు. కాగా, కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఒక్కొక్కరూ పరకాయ ప్రవేశం చేసి వార్తలు రాస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను బద్నాం చేసే విధంగా ఆధారాలు లేకుండా వార్తలు రాయొద్దని అన్నారు.

# జూరాల, శ్రీశైలం మధ్య ప్రాజెక్టు నిర్మిస్తే కృష్ణా జలాల వినియోగం

గత పాలకులు ఇలా ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పూర్తి చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ఒక్కటేనని... అది కుంగిపోయి, కూలిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలోని రెండు లక్షల ఎకరాలకు ఎలాంటి ముంపు రాకుండా పోలవరం ప్రాజెక్టును నిర్మించుకోవాలని ఏపీకి సూచించారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో శనివారం ఉపముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.65.67 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆరు విద్యుత్తు ఉపకేంద్రాలకు మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.అనంతరం కొల్లాపూర్ సభలో భట్టి మాట్లాడారు. "వృథాగా పోయే నీరే కదా.. మేము బనకచర్ల నిర్మించుకుంటామని ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోంది. భారత రాష్ట్ర సమితి, తెదేపా కుమ్మక్కై రాష్ట్రానికి నష్టం చేస్తున్నాయి' అని ఆరోపించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ కృష్ణా నదిపై వెల్లటూరు, చిన్నమర్రి మధ్య డ్యాం కడితే 60 టీఎంసీల నీరు నిల్వ చేసుకోవచ్చన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు, షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, గద్వాల జడ్పీ మాజీ చైర్మన్ సరిత తదితరులు పాల్గొన్నారు.

మల్లురవి ఆగ్రహం

సమయం లేదని.. త్వరగా ప్రసంగం ముగించాలని ఓ నాయకుడు స్లిప్‌ను ఎంపీ మల్లురవికి ఇవ్వగా ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. "నేను వచ్చింది కృష్ణారావు పెట్టిన చేపల కూర, చికెన్ తినడానికి కాదు. రాష్ట్రంలో, దిల్లీలో ఏం జరుగుతుందనే విషయాలు ప్రజలతో మాట్లాడటానికి. ఇలా చేయడం సరికాదు" అని అసహనం వ్యక్తంచేశారు.

మొదటి పేజీ తరువాయి

# మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు



ఈ కబురు,హైదరాబాద్: టాలీవుడ్ నటులు నాగచైతన్య, సమంత విడాకులకు మాజీ మంత్రి కేటీఆరే కారణం అంటూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తన పరువుకు భంగం కలిగిందని నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో గత అక్టోబరులో కేటీఆర్ క్రిమినల్ పరువు నష్టం దావా వేశారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించి, సురేఖపై ఈనెల 21లోపు క్రిమినల్ కేసు నమోదు చేసి, ఆమెకు నోటీసులు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేటీఆర్‌పై సురేఖ నిరాధారమైన ఆరోపణలు చేశారన్న తమ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించిందని కేటీఆర్ తరఫు న్యాయవాది సిద్ధార్థ్ తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలను, కోర్టులో తాము సమర్పించిన వీడియోలు, వార్తలను న్యాయస్థానం పరిశీలించి బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద ఈ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన చెప్పారు. కాగా.. గతంలో మీడియాలో, ఇతరత్రా మాధ్యమాల్లో వచ్చిన వార్తల ఆధారంగానే సురేఖ ఆ వ్యాఖ్యలు చేశారని ఆమె తరఫు న్యాయవాది చేసిన వాదనలను న్యాయస్థానం తోసిపుచ్చింది.

అర్థంలేని విమర్శల చేస్తే అధికారం రక్షించదు: కేటీఆర్

''నిజం ఎప్పటికైనా గెలిచి తీరుతుంది'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పరువునష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు చేయాలంటూ నాంపల్లి కోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో కేటీఆర్ ఈ వ్యాఖ్య చేశారు. ''నువ్వు అర్థం లేని విమర్శలు చేస్తే అధికారం నిన్ను రక్షించదు. ప్రజల జీవితాలను బురదలోకి లాగే హక్కు అధికారం నీకు ఇవ్వదు. అధికారమనేది ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం తప్ప.. ప్రత్యర్థులపై వదంతలు ప్రచారం చేయడానికో.. వ్యక్తిత్వ హననం చేయడానికో.. బురద చల్లడానికో కాదు. రాజకీయాల పేరుతో విషం చిమ్మే ప్రతి ఒక్కరికీ ఇది ఒక గుణపాఠం అవుతుందని ఆశిస్తున్నాను. గెలిచే వరకు పోరాడుతూనే ఉంటాం.. ఈపోరాటంలో మనం ఇంకా సగం వరకే వచ్చాం'' అని ఎక్స్‌లో ఖాతాలో కేటీఆర్ పేర్కొన్నారు.

.కేసులు, కొట్లాటలు కొత్త కాదని, తన జీవితమే ఒక పోరాటం అని మంత్రి కొండా సురేఖ అన్నారు. న్యాయ వ్యవస్థపై గౌరవం, నమ్మకం తనకు ఉన్నాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై తాను చేసిన ఆరోపణల కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సురేఖ స్పందించారు. తన కేసును విచారణకు తీసుకొని ముందు కెళ్లాలని కోర్టు స్పష్టం చేసిందని.. కోర్టులు విచారణకు తీసుకోవాలని చెప్పడం ఏ కేసులోనైనా సర్వసాధారణమైన విషయం అని అన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు.. జాగృతి 72 గంటల నిరాహార దీక్ష



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఈ కబురు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 4 నుంచి 7 వరకు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారికి 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆందోళనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ చెబితే.. విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం ఇవ్వాల్సిందేనని జాగృతి డిమాండ్ చేసిందని తెలిపారు.**

**జాగృతి, బీసీ సమాజం ఒత్తిడితోనే ప్రభుత్వం దిగి వచ్చి పంచాయతీరాజ్ చట్టం-2018కి సవరణలు చేస్తూ ఇటీవల క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపిందని చెప్పారు. దీనికి గవర్నర్ ఆమోదం తెలిపి గెజిట్ జారీ చేయాల్సి ఉండగా, మళ్లీ దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతున్నందున 72 గంటల నిరాహార దీక్ష చేయాలని సంకల్పించామని కవిత తెలిపారు.**

# లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై అణు బాంబులాంటి



ఈ కబురు, ఢిల్లీ: ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించే సమాచారాన్ని త్వరలో తాము వెల్లడించబోతున్నామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యాయంటూ మరోసారి ఆరోపణలు సంధించారు. ఇన్నాళ్లూ ఆధారాల్లేక ఆగామని, ఇప్పుడు అణు బాంబులాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలోనే బహిర్గతం చేస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో కనీసం 1015 లోక్‌సభ స్థానాల్లో రిగ్గింగ్ జరగకపోయినా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యేవారు కాదన్నారు. 70 నుంచి 100 నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగాయని అనుమానిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రభుత్వం స్వల్ప ఆధిక్యంతో కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ న్యాయవాదుల విభాగం శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన సదస్సులో రాహుల్‌గాంధీ కీలకోపన్యాసం చేశారు.

లోక్‌సభ ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేయొచ్చో, ఎలా చేశారోననే అంశాలకు సంబంధించిన ఆధారాలను అతిత్వరలో బయటపెట్టబోతున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. 100% ఆధారాలతో ఈ విషయం చెబుతున్నానని స్పష్టం చేశారు. తాను ఇచ్చిన ఆధారాలను చూసిన వాళ్లు కుర్చీల్లోంచి కిందపడుతున్నారని, ఇదెలా సాధ్యమని ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ సేకరించిన సమాచారాన్ని విశ్లేషించగా మొత్తం 6.5లక్షల ఓటర్లలో 1.5లక్షల మంది నకిలీ ఓటర్లని తేలిందన్నారు. ఓటర్ల ప్రతి పేరును, ప్రతి ఫొటోనూ పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చామన్నారు. ఇక్కడ జరిగిన అక్రమాల తీరును ఈ నెల 5న బెంగళూరులోని ఫ్రీడంపార్కులో బహిరంగపరుస్తామని వెల్లడించారు.

పిరికివాళ్లకు భయపడను

తాను అగ్గితో ఆడుకుంటున్నట్లు సోదరి ప్రియాంకాగాంధీ హెచ్చరించారని రాహుల్ పేర్కొన్నారు. 'పిరికివాళ్లకు భయపడొద్దని నా కుటుంబం నాకు చెప్పింది. అందుకే ఇంత ధైర్యంగా ఈ ప్రభుత్వం చేస్తున్న వ్యవస్థాగత విధ్వంసంపై పోరాటానికి దిగాన'ని చెప్పారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందన్నారు. దీని గురించి బయటపోరాడగలుగుతున్నా కోర్టుల్లో పోరాడలేకపోతున్నామని చెప్పారు. రఫేల్ ఒప్పందాన్ని ప్రస్తావించారు. ''ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. నేను సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు దాన్ని వెంటనే ఆపేయకపోతే మీకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అరుణ్‌జైట్లీ అప్పట్లో హెచ్చరించారు'' అని ఆరోపించారు. తాను రాజుని కావాలని కోరుకోవడం లేదని, ఆ భావనకే వ్యతిరేకినని రాహుల్ పేర్కొన్నారు. ఆయన ప్రసంగం ప్రారంభించిన వెంటనే విజ్ఞాన్ భవన్ హాలులోని ప్రేక్షకులు ''ఈ దేశ రాజు ఎలా ఉంటాడు, రాహుల్ గాంధీలా ఉంటాడు'' అంటూ నినాదాలు చేయగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రసంగించారు.

ఈసీ ఖండన

2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణను ఎన్నికల సంఘం(ఈసీ) శనివారం తోసిపుచ్చింది. ఎన్నికల యంత్రాంగంపై ఒత్తిడి తేవడానికి, ఎన్నికల అధికారులను బెదిరించేందుకే ఈ నిరాధార ఆరోపణలు చేసినట్టు కనిపిస్తోందని కమిషన్ పేర్కొంది. నాడు ఎన్నికలకు ముందు ప్రజా ప్రాతినిధ్య చట్టం మేరకు ముసాయిదా ఎన్నికల జాబితాను, తుది జాబితాను కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలతో పంచుకున్నామని తెలిపింది. ఓటర్ల జాబితాపై దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కడా కాంగ్రెస్ అప్పీళ్లు దాఖలు చేయలేదు, అని కమిషన్ పేర్కొంది.

ఆధారాల సేకరణకు 6 నెలలు కష్టపడ్డా

''2014 నుంచి ఎన్నికల వ్యవస్థలో ఏదో తప్పు జరుగుతోందన్న అనుమానం కలుగుతోంది. ఇదివరకే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపై సందేహం వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో కనీసం ఒక్కసీటూ రాకపోవడం ఆశ్చర్యం కల్గించింది. దీనిపై ఎప్పుడు మాట్లాడినా ఆధారాలేంటని ప్రశ్నించారు. ఇంతలోనే మహారాష్ట్రలో అనుకోనిది జరిగిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఘన విజయం సాధించిన 4 నెలల్లోనే ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మేం దారుణంగా ఓడిపోయాం. మూడు బలమైన పార్టీలు అకస్మాత్తుగా తుడిచిపెట్టుకుపోయాయి. అనుమానాలు బలపడడంతో ఎన్నికల మోసాలపై తీవ్రంగా దృష్టి సారించాను. మహారాష్ట్రలో లోక్‌సభఅసెంబ్లీ ఎన్నికల మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు రావడం ఈ మోసానికి ప్రబల ఉదాహరణ. కొత్త ఓట్లలో అత్యధికం భాజపాకు వెళ్లాయి. సంబంధిత ఆధారాలన్నింటినీ ఇప్పుడు ప్రపంచానికి చూపబోతున్నాం. వీటిని సంపాదించడానికి ఆరునెలలు నిరంతరం పనిచేశాను'' అని రాహుల్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# నువ్వు లేపేస్తా అంటే.. ఇక్కడ ఉన్నది సీబీఎన్



కబురు: '49 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నా.. నా అనుభవంలో ప్రస్తుతం ఉన్నంత దారుణ పరిస్థితి ఎన్నడూ చూడలేదు. రాజకీయమంటే మనల్ని చూసి పది మంది నేర్చుకోవాలి. అంతిమ లక్ష్యం అధికారమే అయినా నిబద్ధత, నైతిక విలువలు, కట్టుబాట్లు ఉం డాలి. కానీ మన రాష్ట్రంలో ఇప్పుడు ఒకాయన వ్యవహారం ఎలా ఉందో చూడండి.. ఆయనను చూసి ఏమి నేర్చుకోవాలి? గొడ్డలి వేటా? బూతుల పంచాంగమా? రప్పా, రప్పా ఏమిటో ప్రజలు ఆలోచించాలి. మా వాళ్లను మీ ఇళ్లకు పంపితే లేపేస్తారని నెల్లూరులో అతను మాట్లాడాడు. నువ్వు లేపేస్తా అంటే.. చూడటానికి ఇక్కడ ఉంది సీబీఎన్' అంటూ వైసీపీ అఽధినేత జగన్‌ను పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. గతంలో తీవ్రవాదులు, ఫ్యాక్షనిస్టులు, సంఘ విద్రోహశక్తులతో పోరాడామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ ముసుగులో కొందరు వస్తున్నారని, వారి రాజకీయ ముసుగు తొలగించి నేరస్తులుగానే పరిగణించాలని అన్నారు. ప్రజల కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం.. కష్టాలు ఉన్నా, ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా 2047 నాటికి దేశంలో ఏపీ ప్రథమస్థానంలో ఉండాలన్న సంకల్పంతో రాత్రింబవళ్లు పనిచేస్తున్నానని, ప్రజలంతా తనకు సహకరించాలని కోరారు. ఇలాంటి సమయంలో రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీ తీరు దారుణంగా ఉందన్నారు. ఆ పార్టీ అధినేత వైఖరిని వివరిస్తూ అలాంటి పార్టీని, అలాంటి నాయకుడిని తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. ''అమరావతి మహిళలను బ్రోతల్స్‌గా చిత్రీకరించేలా మాట్లాడిన దానిపై ప్రకాశం జిల్లాలోనే పొదిలిలో క్షమాపణ చెప్పాలని స్థానిక మహిళలు కోరితే వారిపై దాడులు చేశారు. నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత జీవితంపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే అత్యంత దారుణంగా మాట్లాడారు. అదే నేనైతే అలాంటి వ్యక్తిని పిలిచి వార్నింగ్ ఇచ్చి ఇంకొకరు అలా మాట్లాడకుండా చేసేవాడిని. కానీ ఆ పార్టీ అధినేత వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించడాన్ని ప్రజలు గమనించాలి. బంగారుపాళెం వీడియోలను నెల్లూరులో జరిగినట్లు ఫేక్ ప్రచారం చేశారు. గతంలో నేను ఒకసారి ఏమరుపాటుగా ఉంటే బాబాయ్‌పై గొడ్డలి వేటు వేసి మరుటిరోజు సాక్షిలో నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ప్రజలంతా ఇలాంటివి గమనించాలి'' అని చంద్రబాబు అన్నారు.



# గోదావరిలో మిగులు జలాల్లేవు



ఈ కబురు,హైదరాబాద్: గోదావరిలో మిగులు/వరద జలాలు లేవని.. ఒకవేళ ఉంటే గనక ఆ నీటిపై నదిని పంచుకునే అన్ని రాష్ట్రాలకు సమానవాటా ఉంటుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సముద్రంలోకి వృఽథాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుకుంటామని, అందులో తప్పేముంది? అంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను ఉత్తమ్ తప్పుబట్టారు. సముద్రంలోకి వెళ్లే నీళ్లన్నీ తమవే అనుకోవడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 1980లో గోదావరి ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు చేసిందని, ఆ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా పోలవరం విస్తరణను ఏపీ ప్రతిపాదిస్తోందని ఆక్షేపించారు. పోలవరంబనకచర్ల లింక్‌కు వ్యతిరేకంగా నిర్మాణాత్మక పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. పోలవరంబనకచర్లపై చట్టపరంగానే ముందుకెళతామని కేంద్ర జలశక్తి శాఖ సమాచారం ఇచ్చిందన్నారు. ఇప్పటికే కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), గోదావరి/కృష్ణా నది యాజమాన్య బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లు తిరస్కరించాయని తెలిపారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో మీడియాతో ఉత్తమ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయని, అయితే నికర జలాలపై కట్టుకునే ప్రాజెక్టులపైనే ఏపీ అభ్యంతరాలు చెబుతూ.. వరద జలాలపై ప్రాజెక్టులు కట్టుకుంటామని అంటోందని.. ఇదేం తీరు? అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరిలో 3 వేల టీఎంసీల నీళ్లు ఏటా సముద్రంలో కలుస్తున్నాయని ప్రస్తావించిందని.. ఆ నీటిని వినియోగించుకోవడానికి ప్రణాళికలు చేసుకోవాలని తెరమీదికి తెచ్చిందే ఆ పార్టీ అని ఆక్షేపించారు. రాయలసీమకు నీళ్లిచ్చి.. రతనాల సీమను చేస్తామని ప్రకటించింది ఎవరు? అని నిలదీశారు. గోదావరి నదిపై తుమ్మిడిహెట్టి, ఇచ్చంపల్లి, సమ్మక్కసాగర్ అనుమతులు ఇవ్వడమే కాకుండా ఆయా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కేంద్రం తెలంగాణకు సహకారం అందించాలన్నారు. గోదావరికావేరి అనుసంధానం ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని, ఆ ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటితో పనులు చేసుకునేలా కేంద్రం సహాయం అందించాలని కోరారు. కాగా నీటిపారుదల శాఖలో 30 ఏళ్లలో తొలిసారి శాశ్వత ప్రాతిపదికన ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఏఈఈ నుంచి ఈఎన్‌సీ దాకా తానే చొరవ తీసుకొని ప్రమోషన్లు ఇచ్చామన్నారు.

ఎన్‌వోసీ కోసం ఛత్తీగఢ్‌కు..

సమ్మక్కసాగర్ బ్యారేజీకి ఎన్‌వోసీ ఇవ్వాలంటూ ఛత్తీసగఢ్ ప్రభుత్వాన్ని మంత్రి ఉత్తమ్ కోరారు. శనివారం ప్రాజెక్టుపై చర్చ జరుగుతున్న క్రమంలో ఆ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కేదార్ నాథ్ కశ్యప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడారు. సమ్మక్కసాగర్ వల్ల నీటి ముంపుపై ఐఐటీఖరగ్‌పూర్ నివేదిక వచ్చినందున తక్షణ మే ముంపు ప్రాంతాల పరిహారంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌ను దోషిగా తేల్చింది



ఈ కబురు, నిజామాబాద్, జోగిపేట: కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో అక్రమాలపై విచారణ చేపట్టిన కమిషన్ కేసీఆర్‌ను దోషిగా తేల్చిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా అందోలు మండలం సంగుపేట, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఆయన మాట్లాడారు.'ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇంజినీరింగ్ అధికారుల మాటలు వినకుండా.. కేసీఆర్ అన్నీ తానై వ్యవహరించారు. దీంతో రూ.లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలైంది. సీఎం హోదాలో 2016లో జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలో కేసీఆర్ తలొగ్గడం వల్లే నేడు బనకచర్ల ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. భాజపాను శ్రీరామచంద్రుడు స్థాపించలేదు. దేవుళ్ల పేరు మీద ఓట్లు అడిగే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మేం ఆర్డినెన్స్ తీసుకొస్తే కవితమ్మ ఎందుకు సంబరాలు చేసుకుంటోంది? బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఈ నెల 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయబోతున్నాం' అని ఆయన అన్నారు.ఆర్మూర్‌లో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే 80 శాతం హామీలు అమలు చేసింది. దేశంలో ప్రస్తుతం తెలంగాణ నమూనా ఓవైపు, విద్వేష నమూనాలు మరోవైపు ఉన్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన డిమాండ్‌తో కార్యకర్తలంతా తరలివచ్చి ఢిల్లీ కోటలు బద్దలు కొట్టాలి' అని ఆమె పిలుపునిచ్చారు. బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమాల్లో మంత్రులు సీతక్క, దామోదర్ రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, శంకర్‌నాయక్, మదన్‌మోహన్‌రావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'హాజరే కాదు.. ప్రతిభనూ పరిగణనలోకి తీసుకోండి'

ఈ కబురు, పరీక్షలు రాయడానికి హాజరు శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న సాంకేతిక విద్యాశాఖ, స్వతంత్ర యూనివర్సిటీల నిబంధనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒక సెమిస్టర్‌లో ఉత్తీర్ణులు కాకపోయినా తర్వాతి సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తారని, అయితే అనారోగ్య కారణాలతో హాజరు తక్కువైతే మాత్రం అనుమతించకపోవడం దురదృష్టకరమంది. విద్యలో నాణ్యత పెంచాలంటే కేవలం హాజరు శాతమే కాకుండా విద్యార్థి ప్రతిభనూ పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. హాజరు శాతం తక్కువన్న కారణంగా బీటెక్ మూడో సంవత్సరం 2 సెమిస్టర్ పరీక్షలకు మేడ్చల్ మల్కాజిగిరిలోని గీతాంజలి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్) అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కె.మాన్విత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ మూడో సంవత్సరం చదువుతుండగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారని, రెండుసార్లు శస్త్రచికిత్సలు జరిగాయని తెలిపారు. మెడికల్ రికార్డులన్నీ సమర్పించినా హాజరు శాతం తక్కువన్న కారణంగా పరీక్షకు అనుమతించలేదన్నారు. గతంలో అన్ని సెమిస్టర్లలో హాజరు శాతం బాగా ఉందని, బ్యాక్‌లాగ్‌లు కూడా లేవని పేర్కొన్నారు. ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ సాంకేతిక విద్య నిబంధనల ప్రకారం 65 నుంచి 75 శాతం హాజరు అవసరమని, పిటిషనర్‌కు 49.5 శాతం మాత్రమే ఉందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి విద్యార్థినిని పరీక్షలకు అనుమతించి కోర్సు పూర్తి చేసేందుకు సహకరించాలని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీకి ఆదేశాలు జారీ చేశారు.

# ట్రంప్ టారిఫ్ ప్రభావం మనపై ఉంటుందా.. ఉండదా?

మనదేశం నుంచి అమెరికాకు జరుగుతున్న ఎగుమతులపై నూతన సుంకాల ప్రభావంపై వేర్వేరు అంచనాలు వెలువడుతున్నాయి. అమెరికాకు మనదేశం నుంచి వెళ్తున్న 86 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై.. ఆ దేశం విధించిన 25% సుంకం వల్ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అమెరికా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్‌తో పాటు పలు వర్గాలు అంచనా వేస్తున్నాయి. సగం మేర ఉత్పత్తుల పై ప్రభావం పడొచ్చని మన అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాకు వెళ్లే మన ఎగుమతులపై ఆగస్టు 7 నుంచి అమల్లోకి వచ్చే టారిఫ్ వల్ల తీవ్ర ప్రభావమే పడొచ్చని మేధో సంస్థ జీటీఆర్ఐ అంటోంది.



**మినహాయింపు జాబితాలో సగం వస్తువులు**

అమెరికాకు మనదేశం ఎగుమతి చేస్తున్న వాటిలో సగం వస్తువులు.. సుంకం నుంచి మినహాయించిన విభాగం (ఎక్సెమ్టెడ్ క్యాటగరీ)లో ఉన్నాయి. ఇందులో ఫినిష్డ్ ఫార్మా డ్రగ్స్, ఏపీఐలు, ఇతర కీలక ఔషధ ముడిపదార్థాలు; ఎలక్ట్రానిక్స్ వస్తువులు (కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు), సెమీకండక్టర్లు; ముడి చమురు, రిఫైన్డ్ ఇంధనాలు, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్; కీలక ఖనిజాలు వంటివి ఉన్నాయి. సెక్షన్ 232 ఎగ్జెమ్షన్ కింద భారత ఎగుమతుల్లో 48 బి. డాలర్ల విలువైనవి మాత్రమే ఈ టారిఫ్ ప్రభావానికి గురవుతాయి. అమెరికాకు మనదేశం వ్యవసాయ, డెయిరీ, జన్యుమార్పిడి పంటల రంగాల్లో ఎటువంటి సుంకం మినహాయింపు ఇవ్వడంలేదు.

నీమనదేశం నుంచి ఈనెల 7లోపు నౌకల్లోకి చేరి, అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులు అక్టోబరు 5లోపు అక్కడికి చేరినా, అదనపు సుంకం పడదు. ప్రస్తుత 10 శాతమే ఉంటుంది.

**అమెరికాకే నష్టం -ఎస్‌బీఐ రీసెర్చ్**

భారత్ నుంచి తమ దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ట్రంప్ 25% టారిఫ్ విధించడం వల్ల, అమెరికాకే నష్టమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఇదొక 'నష్టదాయక వ్యాపార నిర్ణయ'ని అభివర్ణించింది. తక్కువ జీడీపీ, అధిక ద్రవ్యోల్బణం, బలహీన డాలరు దిశగా పయనించేలా ఈ నిర్ణయం చేస్తుందని అంచనా వేసింది. ఆర్థికపరంగా చూస్తే భారత్ కంటే అమెరికాకే రేటింగ్ తగ్గే ప్రమాదం ఉందనీ అంటోంది.

అమెరికాలో ద్రవ్యోల్బణం 2026 మొత్తం 2 శాతం (లక్ష్యం) కంటే పైనే కదలాడవచ్చనీ అంటోంది. 'ట్రంప్ టారిఫ్‌ల వల్ల ప్రతి అమెరికన్‌పై స్వల్పకాలంలో 2400 డాలర్ల (సుమారు రూ.2 లక్షలకు పైగా) భారం పడొచ్చు. అల్పాదాయ కుటుంబాలు 1300 డాలర్లు (సుమారు రూ.1.13 లక్షలు) కోల్పోవచ్చు. అధికాదాయ వర్గాలకైతే 5000 డాలర్ల (రూ.4.35 లక్షల) వరకు భారం పడొచ్చ'ని తెలిపింది.

ఫిచ్ మాటా అదే: సుంకాల ప్రభావం భారత్‌పై తక్కువగానే ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. భారత కంపెనీలపై నేరుగా ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని పేర్కొంది.

పెరిగిన నిరుద్యోగిత: అమెరికా వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఆ దేశంలో గత నెలలో 73,000 ఉద్యోగాలే వచ్చాయి. మే, జూన్‌లతో పోలిస్తే ఇది తక్కువ. నిరుద్యోగ రేటు 4.2 శాతానికి పెరిగింది.

**తీవ్ర ప్రభావం ఉండొచ్చు -జీటీఆర్ఐ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో 'ఫర్దర్ మాడిఫైయింగ్ ద రిసిప్రోకల్ టారిఫ్ రేట్స్' పేరిట వెలువడిన అధికారిక ఆదేశాల ప్రకారం.. దాదాపు 70 దేశాలపై టారిఫ్‌లు నిర్ధారించారు. ఇందులో భారత ఎగుమతులపై 25% సుంకం ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదిరితే, ఆయా దేశాలపై టారిఫ్ తగ్గే అవకాశం ఉందనీ తాజా ఆదేశాలు వెల్లడిస్తున్నాయి. 'ప్రస్తుతం విధించిన సుంకాల వల్ల అమెరికాకు వెళ్లే చాలా వరకు భారతీయ వస్తువుల పై ప్రభావం ఉంటుంద'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

202425లో అమెరికాకు భారత ఎగుమతులు 86.5 బి. డాలర్లుగా ఉన్నాయి. తాజా పరిణామాల వల్ల 202526లో ఇవి 30% తగ్గి 60.6 బి. డాలర్లకు చేరొచ్చన్నది ఒక అంచనా.

'నూతన సుంకాల వల్ల దుస్తుల రంగంపై ఎక్కువ ప్రభావం పడనుంది. ఉద్యోగులను భారీగా తొలగించకూడదనుకుంటే, తక్కువ ధరలకు అమెరికాకు దుస్తులను విక్రయించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) ఛైర్మన్ సుధీర్ సెక్రి పేర్కొన్నారు.




## సరికొత్త వోల్వో ఎక్స్‌సీ60

**దిల్లీ:** వోల్వో ఆటో ఇండియా తన ఎక్స్‌సీ60లో ఫేస్‌లిఫ్ట్ వర్షన్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ధర రూ.71.90 లక్షలు. ఈ ఏడాది మొదట్లో అంతర్జాతీయంగా తీసుకొచ్చిన ఈ మోడల్‌ను శుక్రవారం భారత్‌లో ఆవిష్కరించింది. స్టైల్, ఫీచర్ల పరంగా నవీకరించిన ఈ మోడల్‌ను బెంగళూరులోని వోల్వో ప్లాంటులో అసెంబ్లింగ్ చేస్తున్నారు. మిగతా కార్లన్నీ పూర్తిగా తయారైన స్థితి (సీకేడీ)లో దిగుమతి చేసుకుని, విక్రయిస్తున్నారు. ఎక్స్‌సీ 60లో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ కాక్‌పిట్ ప్లాట్‌ఫాం, 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వాయిస్ అసిస్టెంట్, పనోరమిక్ సన్‌రూఫ్, అడాస్ వంటి పలు ఫీచర్లున్నాయి. భారత్‌లో విద్యుత్ కార్ల (ఈవీ) ప్రోత్సాహానికి ఉద్దేశించిన ప్రయోజనాలను వినియోగించుకోవాలని భావించడం లేదని వోల్వో కార్ ఇండియా ఎండీ, జ్యోతి మల్హోత్రా పేర్కొన్నారు. ఈ ఏడాది చివర్లో ఈఎక్స్30 ఈవీని తీసుకురాగలమన్నారు.






## యమహా ఎంటీ-15 బైకులో కొత్త వెర్షన్

**ప్రారంభ ధర రూ.1.69 లక్షలు**

**దిల్లీ:** యమహా మోటార్ ఇండియా తన ఎంటీ 15 బైక్‌లో వెర్షన్ 2.0ను తీసుకొచ్చింది. స్టాండర్డ్ రకం ధర రూ.1.69 లక్షలు (ఎక్స్‌షోరూం) కాగా.. డీఎల్‌ఎక్స్ రకం బైకు ధర రూ.1.8 లక్షలు (ఎక్స్‌షోరూం). డీఎల్‌ఎక్స్ ట్రిమ్.. ఐస్ స్ట్రోమ్, వివిడ్ వయిలెట్ మెటాలిక్ రంగుల్లోనూ, స్టాండర్డ్ బైక్ మెటాలిక్ సిల్వర్ సియాన్ రంగులో లభ్యం కానున్నాయి. ఎంటీ15 డీఎల్‌ఎక్స్ రకం.. కలర్ టీఎఫ్‌టీ స్క్రీన్‌తో తీసుకొచ్చారు. దీనిని యమహా వైకనెక్ట్ యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానం చేస్తే... బైక్ నిర్వహణకు సూచనలు, ఇంధన వినియోగ స్థితి, పార్కింగ్ ప్రాంతం, ఇతర హెచ్చరికలను వినియోగదారులు పొందే వీలుంటుంది. 155 సీసీ లిక్విడ్‌కూల్డ్ ఇంజిన్, సిక్స్ స్పీడ్ గేర్‌బాక్స్‌తో ఈ కొత్త వెర్షన్ బైక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కంపెనీ తెలిపింది.

# యూపీఐలో కొత్త మార్పులు వచ్చేశాయ్..

**యూపీఐ చెల్లింపుల్లో కొత్త మార్పులు వచ్చేశాయి. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్‌లలో డిజిటల్ చెల్లింపు కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడమే లక్ష్యంగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అమలు చేస్తున్న ఈ మార్పులను తీసుకొచ్చింది. ఈ మార్పులు రోజువారీ ఉపయోగంలో పలు యూపీఐ ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. అవేంటో ఈ పథనంలో క్లుప్తంగా తెలుసుకుందాం..**




**ఆటోపే అభ్యర్థనలకు ప్రత్యేక సమయం**

ఇకపై ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు, యుటిలిటీ బిల్లులు లేదా సిప్ ఇన్వెస్ట్మెంట్స్ వంటి సేవల కోసం యూపీఐ ఆటోపే అభ్యర్థనలు అర్ధరాత్రి 12:00 గంటల నుంచి ఉదయం 7:00 గంటల మధ్య మాత్రమే చేసే వీలుంటుంది. పగటిపూట యూపీఐ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించడానికి ఈ ఏర్పాటు చేశారు.

**బ్యాలెన్స్ చెక్ లిమిట్**

యూపీఐ యాప్‌ల ద్వారా తరచూ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం ఇకపై రోజువారీ పరిమితికి లోబడి ఉంటుంది. పరిమితి బహిరంగంగా పేర్కొనబడనప్పటికీ, చాలా మంది వినియోగదారులు రోజుకు కొన్నిసార్లు వారి బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే ఎటువంటి అంతరాయం కనిపించదు.

**లావాదేవీ ఫెయిలైతే వెంటనే తెలుస్తుంది**

పేమెంట్ ఫెయిల్యూర్స్ కు సంబంధించి కీలక అప్‌డేట్స్ లో ఇది ఒకటి. ఒక లావాదేవీ విజయవంతమైందా లేదా విఫలమైందా అని యూపీఐ యాప్స్ కొన్ని సెకన్లలోనే ధృవీకరించాలి. ఇది వినియోగదారులు తమ చెల్లింపులను "ప్రాసెసింగ్" గా ఎక్కువ కాలం మార్క్ చేసినప్పుడు తరచుగా ఎదుర్కొనే నిరీక్షణ సమయాలను తగ్గిస్తుంది.

**బ్యాంకు అకౌంట్ లింక్‌కు కఠిన తనిఖీలు**

కొత్త బ్యాంకు ఖాతాలను యూపీఐతో అనుసంధానం చేసే విషయంలో భద్రతా నిబంధనలను కఠినతరం చేశారు. లింకింగ్ ప్రక్రియలో వినియోగదారులు తమ బ్యాంకుల నుండి అదనపు ధృవీకరణను ఎదుర్కోవాల్సి రావచ్చు. అనధికారిక ఖాతా చేర్పులను నిరోధించడానికి దీన్ని అమలు చేస్తున్నారు.




## పూర్తిగా మహీంద్రా చేతుల్లోకి ఎస్ఎంఎల్ ఇసుజు

**ముంబై:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ (ఎం అండ్ ఎం) ఎస్ఎంఎల్ ఇసుజు లిమిటెడ్‌లో 58.96 శాతం నియంత్రణ వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో కార్పొరేషన్, ఇసుజు మోటార్స్ నుండి రూ.555 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ లావాదేవీలో భాగంగా పబ్లిక్ షేర్ హోల్డర్ల నుంచి అదనంగా 26 శాతం వాటాను పొందేందుకు ఎం అండ్ ఎం తప్పనిసరి ఓపెన్ ఆఫర్ ను ప్రారంభించనుంది.

కొనుగోలు అనంతరం రెగ్యులేటరీ అనుమతులకు లోబడి కంపెనీ పేరును 'ఎస్ ఎంఎల్ మహీంద్రా లిమిటెడ్ 'గా మార్చనున్నారు. అలాగే ఎస్ఎంఎల్ బోర్డును పునర్వ్యవస్థీకరించారు. మహీంద్రా గ్రూప్ లో ఏరోస్పేస్ & డిఫెన్స్, ట్రక్కులు, బస్సులు & సీఈ ప్రెసిడెంట్‌గా ఉన్న వినోద్ సహాయ్ ఎస్ఎంఎల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా నియమితులయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవోగా డాక్టర్ వెంకట్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

ఈ వ్యూహాత్మక కొనుగోలుతో 3.5 టన్నులకుపైబడిన వాణిజ్య వాహన విభాగంలో మహీంద్రా సంస్థ సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఈ విభాగంలో ప్రస్తుతం కంపెనీ 3% మార్కెట్ వాటాను కలిగి ఉంది. 1983లో ఏర్పాటైన ఎస్ఎంఎల్ సంస్థ ట్రక్కులు, బస్సుల విభాగంలో దేశవ్యాప్తంగా బలమైన బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందింది.




# అనవసరపు ఫోన్‌కాల్స్ వేధిస్తున్నాయా.. ఈ టిప్స్ పాటించండి!

నరేంద్ర పనిలో చాలా బిజీగా ఉన్నాడు. అంతలో ఫోన్ మోగింది. చూస్తే కొత్త నెంబర్. ఎవరో అత్యవసరంగా ఫోన్ చేశారేమో అనుకొని ఆన్సర్ చేశాడు. తీరా చూస్తే.. "సార్.. బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. వడ్డీ రేటు చాలా తక్కువగా ఉంది. లోన్ ఏమైనా తీసుకుంటారా?" అని అడిగారు. ఒక్కసారిగా అతడికి చిర్రెత్తుకొచ్చింది. కానీ, ఓపిక తెచ్చుకొని.. అవసరం లేదండీ అని ఫోన్ పెట్టేశాడు. అలాగే, సురేంద్రకు ఎవరో ఫోన్ చేసి.. ఫలానాచోట తక్కువ ధరకే ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. బ్యాంకు లోన్ కూడా వస్తుంది. మంచి అవకాశం సార్.. తీసుకోండి అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నెలాఖరు వచ్చే సరికి కుటుంబం గడవడమే గగనమైపోతోంది. ఇంకా ప్లాట్లు ఎలా కొంటానండీ అంటూ నిట్టూరుస్తూ ఫోన్ పెట్టేశాడు. వీళ్లిద్దరికే కాదు.. చాలామందికి ఇదేతరహా అనుభవం ఎదురవుతూ ఉంటుంది. ప్రతిరోజూ ఇలా ప్రమోషనల్, మార్కెటింగ్ కాల్స్ చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. అయితే, చిన్నచిన్న చిట్కాలతో వీటిని కట్టడి చేయొచ్చు. అవేంటో చూద్దామా?




**1. యాక్టివేట్ డీఎన్‌డీ**

ప్రమోషనల్, మార్కెటింగ్ ఫోన్‌కాల్స్ రాకుండా ఉండాలంటే మొట్టమొదట చేయాల్సిన పని.. మీ ఫోన్ నెంబర్‌పై డీఎన్‌డీ ఆప్షన్‌ను ఎనేబుల్ చేయాలి. ప్రధానంగా మూడు రకాలుగా దీనిని ఎనేబుల్ చేసుకోవచ్చు.

**1. ఎస్ఎంఎస్ ద్వారా..**

0 అని టైప్ చేసి.. 1909కి ఎస్ఎంఎస్ చేయాలి. దీంతో అన్ని సంస్థల నుంచి ప్రమోషనల్ కాల్స్ ఆగిపోతాయి. అయితే, దీనివల్ల మనకు అవసరమైన బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన మెసేజ్‌లు కూడా రావన్న సంగతి గమనించాలి.

**2. ట్రాయ్ డీఎన్‌డీ వెబ్‌సైట్**

https://www.dndcheck.co.in/ వెబ్‌సైట్లోకి వెళ్లి.. 'నేషనల్ డునాట్ కాల్ రిజిస్ట్రీ'లో రిజిస్టర్ చేసుకున్నా ప్రమోషనల్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చు.

**3. టెలికమ్ ప్రొవైడర్ యాప్ ద్వారా..**

దాదాపు టెలికామ్ ప్రొవైడర్లందరికీ.. అధికారిక యాప్ ఉంటుంది. (ఉదాహరణకు మై జియో, ఎయిర్‌టెల్ థ్యాంక్స్, వీఐ యాప్). అందులో డీఎన్‌డీ సెట్టింగ్స్‌కు వెళ్లి ప్రిఫరెన్స్ ఎంపిక చేసుకోవడం ద్వారా ప్రమోషనల్ కాల్స్‌ను బ్లాక్ చేయొచ్చు.

**2. మాన్యువల్ నంబర్ బ్లాకింగ్**

డీఎన్‌డీ సెట్టింగ్స్‌ను యాక్టివేట్ చేసినప్పటికీ అనవసరమైన ఫోన్లు వస్తుంటే.. ఫోన్‌లోని కాల్ బ్లాకింగ్ ఫీచర్‌ను ఉపయోగించి అడ్డుకట్ట వేయొచ్చు. అంతేకాకుండా ట్రూకాలర్, కాల్ బ్లాకర్ లాంటి థర్డ్ పార్టీ యాప్‌లు కూడా ఉన్నాయి. అవి స్పామ్, బ్యాంక్ మార్కెటింగ్ కాల్స్‌ని గుర్తిస్తాయి. ఒకసారి కాల్ వచ్చినప్పుడు 'మార్క్ కాల్స్ యాజ్ స్పామ్' ఆప్షన్ ఎంచుకుంటే.. ఆ తర్వాతి నుంచి ఆయా నెంబర్ల నుంచి కాల్స్ రావు.

**3. నేరుగా బ్యాంక్‌కే సమాచారం**

ప్రత్యేకంగా ఒకే బ్యాంక్‌కు చెందిన మార్కెటింగ్ సిబ్బంది నుంచి తరచూ కాల్స్ వస్తుంటే.. ఆ బ్యాంకు కస్టమర్‌కేర్ సర్వీసుకు కాల్ చేసి గానీ, లేదంటే నేరుగా బ్రాంచ్‌కి వెళ్లి గానీ, 'అప్‌డేట్ యువర్ ప్రిఫరెన్సెస్'ను మార్చాలని కోరండి. అంతేకాకుండా గతంలో మీరు 'మార్కెటింగ్ కమ్యూనికేషన్'కు అంగీకారం తెలిపినట్లయితే.. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు కచ్చితంగా చెప్పండి.

**4. ట్రాయ్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా..**

డీఎన్‌డీ ఆప్షన్‌ను యాక్టివేట్ చేసినప్పటికీ.. కాల్స్ వస్తుంటే.. నేరుగా 1909కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేయొచ్చు. https://www.nccptrai.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు.

**5. అధికారిక వెబ్‌సైట్ ద్వారా..**

బ్యాంక్ వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ అయి.. కమ్యూనికేషన్ ప్రిఫరెన్సెస్ లేదా ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి.. మార్కెటింగ్/ ప్రమోషనల్ ఈ మెయిల్స్/ ఎస్ఎంఎస్/ కాల్స్ ఆప్షన్‌ను డిజేబుల్ చేయడం ద్వారా అనవసరపు ఫోన్ కాల్స్‌ని నియంత్రించవచ్చు.

# అలరించేలా 'కూలీ' ట్రైలర్.. మీరు చూశారా?




సూపర్‌స్టార్ రజినీకాంత్ 'కూలీ' ట్రైలర్ ఎట్టకేలకు రిలీజైంది. ఇప్పటికే పాటలు మంచి క్రేజ్ తెచ్చుకోగా.. ఇప్పుడొచ్చిన ట్రైలర్, ఉన్న హైప్‌ని మరింత పెంచేలా ఉంది. రజనీ మాస్ షాట్స్, అనిరుధ్ మ్యూజిక్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. లోకేశ్ కనగరాజ్ ఈసారి మరింత మాస్ మూవీతో రాబోతున్నాడని ఓ క్లారిటీ వచ్చేసింది.

ఈ సినిమా అంతా వాచీల స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తెరకెక్కించారు. ఇందులో రజినీకి విలన్‌గా నాగార్జున నటించారు. వీళ్లతో పాటు ఆమిర్ ఖాన్, సత్యరాజ్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతి హాసన్.. ఇలా బోలెడంత మంది స్టార్స్ ఉన్నారు. భారీ బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది.



# 33 ఏళ్లకు తొలి జాతీయ పురస్కారం

చిత్రపరిశ్రమలో కొందరు దర్శకులు తాము సిద్ధం చేసుకున్న కథకు, అందులోని పాత్రలకు సరిపోయే నటుల్ని ఎంపిక చేసుకుంటుంటారు. ఇంకొందరు కథానాయకులను దృష్టిలో ఉంచుకొనే పాత్రలను సృష్టిస్తుంటారు. ఇలా రెండు విధానాల్లోనూ ఒదిగిపోయే అద్భుతమైన నటుడు షారుక్ ఖాన్. 'చనిపోయే వరకూ సినిమాల్లోనే ఉంటా. ఏదైనా సినిమా సెట్‌లో యాక్షన్ చెప్పగానే నేను చనిపోవాలి. వాళ్లు కట్ చెప్పాక కూడా నేను పైకి లేవకూడదు. ఇదే నా కోరిక''.. అంటూ ఇటీవలే ఓ సందర్భంలో పంచుకున్నారు షారుక్. ఈ మాటలతో ఆయనకు సినిమాపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే షారుక్‌ను ఎంతో మంది అభిమానులకు దగ్గర చేసి తిరుగులేని స్టార్‌ని చేసింది. ఈ ఏడాది ఉత్తమ నటుడిగా జాతీయ స్థాయిలో నిలబెట్టింది. అట్లీ దర్శకత్వం వహించిన 'జవాన్' సినిమాకు గానూ ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారాయన.

ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో విభిన్నమైన గెటప్పుల్లో ఒదిగిపోయి.. పోరాట ఘట్టాల్లో అదరగొట్టారు షారుక్. 'దీవానా' సినిమాతో వెండితెరపై మెరిసిన ఆయన.. బాలీవుడ్ అగ్రహీరోల్లో ఒకరిగా నిలిచారు. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే', 'స్వదేశ్', 'చక్‌దే! ఇండియా', 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'బాజీగర్', 'దేవదాస్' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్ని పోషించి తన నటనతో కట్టిపడేశారు షారుక్. కింగ్ ఖాన్ అంటూ అభిమానులు ప్రేమగా పిలుచుకునే ఈయన పద్మశ్రీతో సహా ఎన్నో పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు. దాదాపు 100కి పైగా సినిమాల్లో నటించిన షారుక్ 33ఏళ్ల సినీ కెరీర్‌లో ఇదే తొలి జాతీయ పురస్కారం కావడం విశేషం.

# ఇతర భాషల్లో సినిమాలు చేస్తే దివ్యాంగుల్లా అనిపిస్తుంది



కోలీవుడ్‌లో దీన, రమణ, గజనీ, తుపాకీ, సర్కార్ ఇలా వరుసగా విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి స్టార్ దర్శకుల లిస్ట్‌లో ఏఆర్.మురుగదాస్ చేరిపోయారు. ఈయన తెరకెక్కించిన గజనీ చిత్రాన్ని హిందీలో అమీర్‌ఖాన్ హీరోగా చేసి విజయాన్ని సాధించారు. అదేవిధంగా తెలుగులో చిరంజీవి హీరోగా స్టాలిన్ పేరుతో ఒక సినిమా చేశారు. ఇటీవల సల్మాన్‌ఖాన్ హీరోగా సికిందర్ అనే చిత్రాన్ని చేశారు. ఈ చిత్రం డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో నెటిజన్లతో పాటు బాలీవుడ్ ప్రేక్షకులు కూడా దర్శకుడితోపాటు యూనిట్ సభ్యులపై విమర్శలు గుప్పించారు.

కాగా మురుగదాస్ ప్రస్తుతం తమిళంలో శివకార్తికేయన్ హీరోగా మదరాసి చిత్రం చేస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 5న తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మురుగదాస్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను ఇతర భాషల్లో చిత్రాలు చేసేటప్పుడు దివ్యాంగుల్లా భావన కలుగుతుందన్నారు. అదే మాతృభాషలో చిత్రం చేయడం చాలా బలం అని అన్నారు. కానీ, తెలుగులో మాత్రం అలాంటి ఇబ్బంది రాలేదన్నారు. ఎందుకంటే తెలుగు భాష కూడా ఇంచుమించు మన భాషలానే ఉండడంతో పట్టు దొరుకుతుందన్నారు.

భాష తెలియని ప్రాంతంతో చిత్రం చేయడం దివ్యాంగుల మాదిరి భావన కలుగుతుందనే అభిప్రాయాన్న మురుగదాస్ వ్యక్తం చేశారు. కాగా హిందీలో రెండు చిత్రాలు చేసిన ఆయన ఇలా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. హిందీలో తెరకెక్కించిన సికిందర్ సినిమా డిజాస్టర్ కావడం వల్లనే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది.

# శ్రీలంకలో వరలక్ష్మి .. ఎందుకో తెలుసా?

**ఎదగడానికైనా, ఎదిగిన తరువాత అయినా ప్రచారం ముఖ్యంగా మారిన రోజులివి. ప్రస్తుతం అలాంటి ప్రచారంలో ఉన్నారు నటి వరలక్ష్మి శరత్‌కుమార్. ఈమె తెలియని సినీ ప్రేక్షకులు ఉండరనే చెప్పవచ్చు. ఎందుకంటే వరలక్ష్మి నటించిన పాత్రలు అంత బలంగా ఉంటాయి. 2012లో పోడాపోడీ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయమైన ఈమె శరత్‌కుమార్ వారసురాలు అన్నది తెలిసిందే. అయితే హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చినా, అలాంటి పాత్రలకే పరిమితం కాకుండా ప్రతినాయకిగానూ నటించడమే ఈమె ప్రత్యేకత. అలా ఎలాంటి పాత్రకైనా రెడీ అనే వరలక్ష్మి బహుభాషా నటి కూడా.**

తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న ఈ భామ ఇటీవల పెళ్లి చేసుకుని సంసార జీవితంలోకి అడుగు పెట్టారు. కారణాలేమైన ఇప్పుడీమెకు అవకాశాలు తగ్గాయి. దీంతో అవకాశాల వేటలో పడ్డారనే చెప్పవచ్చు. అందులో భాగంగా శ్రీలంకకు వెళ్లి ప్రత్యేకంగా ఫొటో సెషన్ ఏర్పాటు చేసుకుని ఆ ఫొటోలను మీడియాకు విడుదల చేశారు.

శ్రీలంకలో చిన్నమోన్ లైఫ్ సిటీ ఆఫ్ డ్రీమ్స్ ప్రాంతంలో ఈమె ఫొటో షూట్ నిర్వహించినట్లు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆ ఫొటోల్లో తనకే సొంతమైన అందంతో పాటు ధైర్యాన్ని వ్యక్తం చేసేలా వరలక్ష్మి కనిపించడం విశేషం. పలు చిత్రాల్లో తన కంటూ ప్రత్యేకతను చాటుకున్న వరలక్ష్మి ఇటీవల నటించిన ది వెర్డిక్ట్ చిత్రంలో ఆమె నటనకు ప్రశంసలను అందుకున్నారు.





# ప్రేమ రూమర్స్.. సీక్రెట్‌గా మూవీ చూసిన రష్మిక

విజయ్ దేవరకొండ పేరు చెప్పగానే చాలామందికి అతడి సినిమాల కంటే రష్మికనే ముందు గుర్తొస్తుంది. ఎందుకంటే గతంలో కలిసి నటించిన వీళ్లు.. ప్రస్తుతం ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకుంటారనే రూమర్స్ ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. రీసెంట్ టైంలో ఈ పుకార్లని బలపరిచేలా విజయ్, రష్మిక వేర్వేరు సందర్భాల్లో చేసిన కామెంట్స్ చర్చనీయాంశమయ్యాయి. ఇప్పుడు రూమర్ బాయ్ ఫ్రెండ్ కోసం రష్మిక మరో క్రేజీ పని చేసింది. ఆ విషయాన్ని నిర్మాత నాగవంశీ బయటపెట్టారు.

విజయ్ దేవరకొండ లీడ్ రోల్ చేసిన 'కింగ్డమ్' మూవీ రీసెంట్‌గా థియేటర్లలోకి వచ్చింది. మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ బాగానే ఫెర్ఫార్మ్ చేస్తోంది. రిలీజ్ రోజే.. 'మనం కొట్టినం' అని సంతోషంగా సినిమా సక్సెస్ గురించి రష్మిక పోస్ట్ పెట్టింది. ఇప్పుడు సీక్రెట్‌గా హైదరాబాద్‌లోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్‌కి వెళ్లి మరీ ఈ మూవీ చూసొచ్చింది. తాజాగా పలువురు మీడియా వాళ్లతో రౌండ్ టేబుల్ ఇంటర్వ్యూ జరగ్గా.. ఇందులో మాట్లాడిన నాగవంశీ ఈ సంగతి చెప్పుకొచ్చారు.

భ్రమరాంబ థియేటర్‌లో రష్మిక.. 'కింగ్డమ్' చూడాలనుకుందని, అయితే ఈమె వెళ్లిన తెలిస్తే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో రహస్యంగా వెళ్లి సినిమా చూసొచ్చారు అని నాగవంశీ.. అసలు సంగతి చెప్పారు. దీంతో విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ తెగ సంబరపడిపోతున్నారు. విజయ్-రష్మిక బాండింగ్ అంటే ఇది అని మాట్లాడుకుంటున్నారు. ఇకపోతే 'కింగ్డమ్' చిత్రానికి రెండు రోజుల్లో రూ.53 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్ వచ్చాయని నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చూస్తుంటే మరికొన్ని రోజుల్లో రూ.100 కోట్ల మార్క్ దాటేయడం గ్యారంటీ అనిపిస్తోంది.

# 'మహావతార్ నరసింహ' మరో రికార్డు

**ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది 'మహావతార్ నరసింహ' . మొదటిరోజు నుంచే పాజిటివ్ టాక్‌తో వసూళ్లను సొంతం చేసుకుంటోంది. తాజాగా ఈ సినిమా మరో మైలురాయిని చేరుకుంది. దేశంలోని యానిమేటెడ్ సినిమాల్లో చరిత్ర సృష్టించింది.**



హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమా 8 రోజుల్లోనే రూ.60.5 కోట్లు వసూళ్లను సొంతం చేసుకుంది . ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిందని పేర్కొంది. 8 రోజుల్లోనే ఈ ఘనతను సాధించడం ఆనందంగా ఉందని తెలిపింది. మరోవైపు అమెరికాలోనూ ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిందని అక్కడి నిర్మాణసంస్థ వెల్లడించింది. ఇది డివైన్ బ్లాక్‌బస్టర్ అని పేర్కొంది.

'మహావతార్ నరసింహ' దర్శకుడు అశ్విన్‌కుమార్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ఒకవేళ భవిష్యత్తులో ఈ ఫ్రాంఛైజీలో లైవ్ యాక్షన్ సినిమాను తెరకెక్కిస్తే రాముడిగా ఎవరిని ఎంపిక చేసుకుంటారని అడిగిన ప్రశ్నకు ఆయన రామ్‌చరణ్‌ను ఎంపిక చేసుకుంటానని చెప్పారు. దీంతో ఈ కామెంట్‌ను చరణ్ అభిమానులు షేర్ చేస్తున్నారు.

# ఎన్టీఆర్ అన్న కోసం మా మూవీ టైటిల్ మార్చుకున్నాం: విజయ్ దేవరకొండ

**'కింగ్డమ్' మూవీకి తొలుత 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని, ఎన్టీఆర్ 'దేవర' కోసం ఆ టైటిల్ వదులుకున్నామని కథానాయకుడు విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కీలక పాత్రలో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం విజయ్ దేవరకొండ విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.**

''కింగ్డమ్' విషయంలో ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే. ఇదే కాదు, ప్రతి సినిమాకు నాకు ఒత్తిడి ఉంటుంది. ఇంతకు ముందు చేసిన సినిమా హిట్ అయిందని ప్రశాంతంగా కూర్చోలేం కదా. ఇది విజయం సాధిస్తే, తర్వాత సినిమాకు రిలాక్స్ అయిపోలేం కదా. 'కింగ్డమ్'కు తెలుగుతో పాటు, తమిళంలో మంచి ఆదరణ దక్కుతోంది''

''ఈ మూవీలో అనేక పార్శ్వాలు ఉన్నాయి. ఈ కథను నాకు చెప్పిన తర్వాత దీనిని మూడు గంటల్లో చెప్పటం కష్టమనిపించింది. మొదటి పార్ట్‌లో సూరి జర్నీ మాత్రమే చూపించాం. ముఖ్యంగా అన్నను వెతుక్కుంటూ ఎలా వెళ్లాడన్నది మాత్రమే తీశాం. అయితే, చివరి 20 నిమిషాల్లో సూరి లక్ష్యం మారిపోతుంది. ఒక కానిస్టేబుల్ కథతో మొదలై రాజు అవడంతో ఈ భాగం ముగిసింది''

ఈ కథ వినగానే రిఫరెన్స్ కోసం 'వైకింగ్స్', 'ది లాస్ట్ కింగ్డమ్' వంటి సిరీస్‌లు వరుసగా చూశా. ఇక కానిస్టేబుల్ కనిపించే తొలి సన్నివేశాల్లో చాలా సన్నగా కనిపిస్తా. 'ఫ్యామిలీస్టార్' చేయడానికి ముందు కొన్ని రోజుల పాటు చేసిన షెడ్యూల్ అది. ఆ తర్వాత స్పైగా, పోరాట యోధుడిగా కనిపించేందుకు ఆరు నెలలు ప్రత్యేక కసరత్తులు చేశా''

''కింగ్డమ్' పార్ట్2'లో కచ్చితంగా స్టార్ హీరో ఉంటారు. అయితే, సోషల్ మీడియాలో 'రానా' అంటూ జరుగుతున్న చర్చలో నిజం లేదు. ఎవరనేది దర్శకుడు గౌతమ్ చెబుతారు.




''నెగిటివిటీ గురించి నేను పెద్దగా ఆలోచించను. అది చాలా సాధారణమైంది. దాని గురించి నాకు ఎలాంటి కంప్లయింట్స్ లేవు. 10ఏళ్ల కిందట నేను ఎవరికీ తెలియదు. ఇంత మంది మనల్ని చూడటానికి వస్తున్నారంటే అది నా అదృష్టం. అభిమానులు, ప్రేక్షకులు పంచే ప్రేమ అది''

''అర్జున్‌రెడ్డి'కి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకున్నప్పుడు గర్వంగా అనిపించింది. ఆ మూవీ ఆడియో ఫంక్షన్‌కు వందల మంది వచ్చారు. మనకోసం వస్తున్న వారి కోసం ఏదైనా చేయాలనిపించింది. నాకు వచ్చిన అవార్డును వేలం వేస్తే రూ.25లక్షలు వచ్చాయి. వాటిని మంచి పనులకు ఉపయోగించా. అసలు 'అర్జున్‌రెడ్డి'కి నేను తీసుకున్న పారితోషికం రూ.5లక్షలు. అప్పట్లో అంత పెద్ద అమౌంట్ నేను చూడలేదు.

'కింగ్డమ్'లో పాట తీసేయాలన్న నిర్ణయం దర్శకుడు గౌతమ్, ఎడిటర్ నవీన్‌నూలిదే. పాటను ముందుగానే విడుదల చేశాం. అందులో స్పై ఏజెంట్‌గా సమాచారాన్ని ఎలా సేకరిస్తానన్నది చూపించాం. అది అందరికీ తెలిసింది. దాని గురించి మళ్లీ 3 నిమిషాలు సినిమాలో ఎందుకనిపించింది. ఇప్పుడు తీయడంతో అందరూ అడుగుతున్నారు (నవ్వులు)

''షిప్‌లాగే సీన్‌ను మే నెలలో మండుటెండల్లో తీశాం. అది తీసేటప్పుడు ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తి ఉంది. 'జెర్సీ'లో ఉన్న మూమెంట్ అనే ఆలోచనతో చేయలేదు. ఇప్పుడు ప్రేక్షకులు ఆ సీన్ గురించి గొప్పగా మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది.

''నేను ఏ డైలాగ్ చెప్పినా యాసలో ఉందని అంటున్నారు. 'కల్కి'లో నాగ్ అశ్విన్ రాసిన డైలాగ్‌నే చెప్పాను. ఏం చేస్తాం. దేవుడు నాకిచ్చిన గొంతు అది. అసలు అర్జునుడు మాతృభాష ఏంటి?ఎలా మాట్లాడతాడు? ఏమైనా రిఫరెన్స్‌లు ఉంటాయా? ప్రతి విషయంలోనూ యాస గురించి మాట్లాడితే నేనేం చెప్పను''

ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నా. రాయలసీమ నేపథ్యంలో సాగే కథ అది. అలాగే రవి కిరణ్ కోలాతో చేసే కథ కూడా చాలా వైవిధ్యమైనది.

# రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఆలౌట్.. ఇంగ్లాండ్ లక్ష్యం 374



**లండన్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 75/2తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్.. 396 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్‌కు 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118; 164 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం (ఓవర్‌నైట్ 51) బాదాడు. ఆకాశ్ దీప్ (66; 94 బంతుల్లో 12 ఫోర్లు) అర్ధ శతకంతో (ఓవర్‌నైట్ 4) ఆకట్టుకున్నాడు. రవీంద్ర జడేజా (53; 77 బంతుల్లో 5 ఫోర్లు) కూడా హాఫ్ సెంచరీ చేశాడు. ధ్రువ్ జురెల్ (34; 46 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (53; 46 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ప్రసిద్ధ్ కృష్ణతో కలిసి సుందర్ పదో వికెట్‌కు 39 పరుగులు (25 బంతుల్లో) జోడించడం విశేషం. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 5, అట్కిన్సన్ 3, జేమీ ఒవర్టన్ 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224, ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.**



## ‘బుమ్రా’ లేకపోతే ‘మియా’ను తట్టుకోలేరు.. ప్రత్యర్థికి వణుకే!



జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ చేస్తుంటే అతిసాధారణ బౌలర్‌గా కనిపిస్తాడు. వికెట్లు తీయడమూ కష్టమే. ప్రత్యర్థి బ్యాటర్లకు లక్ష్యంగా మారతాడు. ధారాళంగా పరుగులు సమర్పిస్తాడు. ఇదంతా నాణేనికి ఒక వైపు..

బుమ్రా లేడు.. బౌలింగ్ భారమంతా తనపైనే పడింది అయినా వెన్ను చూపని సూపర్ బౌలర్ అయిపోతాడు. పేస్ ఎటాక్‌ను ముందుండి నడిపిస్తాడు. వికెట్లు తీసి ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయిస్తాడు. ఇది నాణేనికి రెండో వైపు..

ఇంతకీ ఆ నాణెం ఎవరు అనేగా మీ సందేహం.. మన హైదరాబాదీ బౌలర్, టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్. బుమ్రా తుది జట్టులో ఉంటే ప్రధాన బ్యాటర్ల దృష్టి ఎక్కువగా అతడి పైనే ఉండేది. బుమ్రాను కాచుకొని.. మిగతా బౌలర్లపై ఎటాకింగ్ గేమ్ ఆడదామని భావిస్తారు. అదే ఒక్కోసారి సిరాజ్ పాలిట నష్టంగా మారేది. ఎప్పుడైతే బుమ్రా విశ్రాంతి తీసుకొని పక్కన కూర్చుంటాడో.. సిరాజ్ మియాలోని ‘సిసలైన పేసర్’ మేల్కొంటాడు. ఆ విషయం ఒకసారి అతడి గణాంకాలను చూస్తే అర్థమైపోతుంది.

**బుమ్రా ఉంటే ఇలా.. లేకపోతే అలా**

సిరాజ్ కెరీర్‌లో ప్రస్తుతం 41వ టెస్టు మ్యాచ్ ఆడుతున్నాడు. ఇందులో 25 మ్యాచులు బుమ్రాతో కలిసి బౌలింగ్‌ను పంచుకున్నాడు. అప్పుడు అతడు తీసిన వికెట్లు 74. అదీనూ 35 సగటు, 57.3 స్ట్రైక్‌రేట్‌తో ప్రదర్శన చేశాడు. కానీ, బుమ్రా లేనప్పుడు 16* టెస్టులు ఆడిన సిరాజ్ 44 వికెట్లు పడగొట్టాడు. యావరేజీ కూడా 25.59కి తగ్గింది. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనూ ఇప్పటివరకు అత్యధిక వికెట్లు (18) తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఐదు టెస్టుల్లోనూ బరిలోకి దిగిన అతడు ఏకంగా 155 ఓవర్లపాటు బౌలింగ్ చేయడం గమనార్హం. ఇందులో ఎడ్జ్‌బాస్టన్‌లో ఆకాశ్‌దీప్‌తో కలిసి జట్టును గెలిపించాడు. ఇప్పుడు ఓవల్‌లోనూ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసి ‘పెద్దన్న’ పాత్ర పోషించాడు.

**సవాళ్లంటే ఇష్టం..**

సిరాజ్‌కు సవాళ్లంటే చాలా ఇష్టం. అలాగే తనకు వికెట్ రాలేదని నిరుత్సాహమూ దరి చేరనీయడు. ఇదే విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ‘వికెట్ దక్కలేదని బాధపడటం కంటే బాగా బౌలింగ్ చేస్తున్నామనే సంతృప్తి ఎక్కువ ఉండాలి. నిరంతరం అదే ప్లేస్‌లో బంతి వేస్తూ ఉంటే వికెట్లు అవే వస్తాయి. ఆ ప్రయత్నాన్ని విడిచిపెట్టను. మిగతాదంతా దేవుడు చూసుకుంటాడు’ అని అన్నాడు. జట్టు బౌలింగ్ బాధ్యతలను తీసుకోవడం అంటే కూడా అతడికి చాలా ఇష్టం. ఓవైపు ప్రత్యర్థి బ్యాటర్లు తనను టార్గెట్ చేసినా సరే.. వెనకడుగు వేయడు. ఒకదశలో ఫామ్ కోల్పోయి జట్టు నుంచి తప్పించినా సరే కుంగిపోలేదు. మళ్లీ తన సత్తా ఏంటో నిరూపించుకుని జట్టులోకి వచ్చాడు. అతడిని కేవలం కొన్ని దేశాలకే పరిమితం చేస్తేనే బాగా ఆడతాడంటూ కామెంట్లూ వచ్చాయి. ఎందుకంటే శ్రీలంకపై ఎక్కువగా వికెట్లు తీసేవాడు. మిగిలిన టీమ్‌లపై పెద్దగా ప్రభావం చూపించేవాడు కాదు. అందుకే, అలాంటి వ్యాఖ్యలు వినిపించాయి. అయినా వాటిని పట్టించుకోకుండా ఇప్పుడీ సిరీస్‌లో ‘టాప్’ బౌలర్‌గా నిలిచాడు.

జస్‌ప్రీత్ బుమ్రాతో సిరాజ్ అనుబంధం ప్రత్యేకమైంది. ఇంగ్లాండ్‌తో చివరి మ్యాచ్‌కు బుమ్రా దూరమయ్యాడు. స్వదేశానికి తిరిగివెళ్తాడన్న వార్తలు వచ్చాయి. దీంతో రెండోరోజు ఆట సమయంలో ‘నేను ఐదు వికెట్లు తీస్తే ఎవరిని హగ్ చేసుకోవాలి జస్సీ భాయ్’ అంటూ సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఆ మాటలకు బుమ్రా స్పందిస్తూ ‘ఇక్కడే ఉంటా. నువ్వు ఐదు వికెట్లు తీయ్’ అని అన్నాడు. అయితే, సిరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లను పడగొట్టాడు.

**ఫిట్‌నెస్ అదుర్స్..**

బుమ్రా బౌలింగ్ శైలితో అతడికి గాయాల బెడద ఎక్కువ. కానీ, సిరాజ్ పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. చిన్నప్పటినుంచి టెన్నిస్ బంతితో బౌలింగ్ చేసిన అనుభవం, ఫిట్‌నెస్‌పై చూపించే శ్రద్ధతో మైదానంలో ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటాడు. ఈ సిరీస్‌లో అందరికంటే ఎక్కువగా ఓవర్లు వేసిన బౌలర్ సిరాజే. ఇప్పుడు ఐదోటెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆకాశ్‌దీప్‌తో కలిసి సిరాజ్ మారథాన్ స్పెల్‌లో సంధించాడు. అయినా, బౌలింగ్ చేయడానికి సిద్ధమని కెప్టెన్ గిల్‌తో సిరాజ్ అన్న మాటలు స్టంప్ మైక్స్‌లో వినిపించాయి. ఇంగ్లాండ్ మొత్తం 51.2 ఓవర్లు ఆడితే అందులో సిరాజ్ 16.2 ఓవర్లు, ఆకాశ్ 17 ఓవర్లు, ప్రసిద్ధ్ 16 ఓవర్లు విసిరారు. జో రూట్‌ను ఔట్ చేసిన విధానం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అతడి డిఫెన్స్‌ను ఛేదించి ఎల్బీ చేయడం మామూలు విషయం కాదు. ఇక ఫీల్డింగ్‌లోనూ సిరాజ్ చిరుతలా ఉంటాడని మనందరికీ తెలిసిందే.

## భర్తతో విడాకులు.. ఊహించని ట్విస్ట్ ఇచ్చిన సైనా నెహ్వాల్

**భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ అభిమానులకు శుభవార్త చెప్పింది. భర్త పారుపల్లి కశ్యప్ తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ.. “దూరం దగ్గర చేసింది” అని క్యాప్షన్ ఇచ్చింది. తద్వారా తాము తిరిగి కలిసిపోయామనే సంకేతాలు ఇచ్చింది.**



కాగా భర్త పారుపల్లి కశ్యప్‌తో తాను విడిపోతున్నట్లు సైనా నైహ్వాల్ గత నెలలో ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూలై 13న సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

**ఆలోచించే విడాకుల నిర్ణయం**

“జీవితం మనల్ని ఒక్కోసారి వేర్వేరు దిశల్లో ప్రయాణించేలా చేస్తుంది. సుదీర్ఘ చర్చలు, ఆలోచనల అనంతరం నేను, కశ్యప్ విడిపోవాలని నిశ్చయించుకున్నాం. ఈ బంధంలో నాకెన్నో మధురానుభూతులు ఉన్నాయి. ఇకపై కూడా మేము స్నేహితుల్లా కొనసాగుతాం’’ అని సైనా నోట్ విడుదల చేసింది.

**ఊహించని ట్విస్ట్**

అయితే, తాజాగా శనివారం పారుపల్లి కశ్యప్‌తో కలిసి దిగిన ఫొటోలను సైనా నెహ్వాల్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ‘‘కొన్నిసార్లు దూరమే.. మన సన్నిహితులతో కలిసి ఉండటం ఎంత విలువైనదో నేర్పుతుంది. మేము కలిసి ఉండేందుకు మరో ప్రయత్నం చేస్తున్నాం’’ అని రెండు హార్ట్ ఎమోజీలతో సైనా క్యాప్షన్ జతచేసింది. కాగా భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ దగ్గర శిక్షణ తీసుకున్న సైనా, కశ్యప్ చాలా ఏళ్లపాటు ప్రేమించుకున్నారు. 2018లో పెళ్లి బంధంతో ఒక్కటైన వీరు అన్యోన్యంగా ఉండేవారు. కెరీర్ పరంగానూ ఒకరికొరు అండగా ఉంటూ కపుల్ గోల్స్ సెట్ చేసేవాళ్లు. అయితే, సైనా విడాకుల ప్రకటన చేయగా.. కశ్యప్ మాత్రం అపుడు స్పందించలేదు.

ఇక ఇప్పుడు భార్యతో కలిసి పోస్ట్ షేర్ చేస్తూ తమ రీయూనియన్‌ని మాత్రం తెలియజేశాడు. కాగా లండన్ ఒలింపిక్స్2012లో మహిళల సింగిల్స్ విభాగంలో సైనా కాంస్యం గెలవగా.. అదే ఎడిషన్‌లో కశ్యప్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు.



## ఆకాశ్ దీప్ హాఫ్ సెంచరీ..

**లండన్:** ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న ఐదో టెస్టులో మూడో రోజు ఆట కొనసాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 75/2తో ఆటను ప్రారంభించిన టీమ్‌ఇండియా భోజన విరామ సమయానికి మరో వికెట్ కోల్పోయి 189 పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 4తో క్రీజులోకి వచ్చిన ఆకాశ్ దీప్ (66; 94 బంతుల్లో 12 ఫోర్లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. యశస్వి జైస్వాల్ (85*; 106 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీకి (ఓవర్‌నైట్ 51) చేరువయ్యాడు. జైస్వాల్, ఆకాశ్ జోడీ మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం (150 బంతుల్లో) నెలకొల్పింది. 70 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న ఆకాశ్.. తర్వాత నాలుగు ఫోర్లు బాది ఒవర్టన్ బౌలింగ్‌లో అట్కిన్సన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ప్రస్తుతం భారత్ ఆధిక్యం 166. జైస్వాల్‌కుతోడుగా శుభమన్ గిల్ (11*) క్రీజులో ఉన్నాడు.



## ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు.. పట్టుబిగిస్తున్న భారత్

**లండన్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదో టెస్టులో భారత్ పట్టుబిగిస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో 189/3తో మూడో రోజు, శనివారం రెండో సెషన్‌ను ప్రారంభించిన భారత్ టీ విరామ సమయానికి 6 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (25*; 48 బంతుల్లో), ధ్రువ్ జురెల్ (25*; 24 బంతుల్లో) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ ఆధిక్యం 281. ఇంగ్లాండ్‌కు టీమ్‌ఇండియా 350కుపైగా లక్ష్యాన్ని నిర్దేశిస్తే మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 22తో ముగించేందుకు అవకాశం ఉంటుంది.

ఈ సెషన్‌లో 26 ఓవర్లు ఆడిన టీమ్‌ఇండియా 115 పరుగులు చేసి మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118; 164 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం బాదాడు. కరుణ్ నాయర్ (17; 32 బంతుల్లో 3 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (11) నిరాశపర్చారు. రెండో సెషన్ ఆరంభం కాగానే తొలి బంతికే గిల్‌ను అట్కిన్సన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నిలకడగా ఆడిన కరుణ్ నాయర్ కూడా అట్కిన్సన్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. మరోవైపు, 127 బంతుల్లో శతకం చేసిన యశస్వి జైస్వాల్.. టీ బ్రేక్‌కు ముందు జోష్ టంగ్ బౌలింగ్‌లో ఒవర్టన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇక, తొలి సెషన్‌లో ఆకాశ్ దీప్ (66; 94 బంతుల్లో 12 ఫోర్లు) అర్ధశతకం చేసిన సంగతి తెలిసిందే.



## భారత్ ఫుట్‌బాల్ కోచ్‌గా జమీల్

**13 ఏళ్ల తర్వాత స్వదేశీ కోచ్**

**న్యూఢిల్లీ:** భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చాన్నాళ్ల తర్వాత స్వదేశీ కోచ్‌ను నియమించారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) భారత్‌కు చెందిన ఖాలిద్ జమీల్‌కు జాతీయ జట్టు కోచింగ్ బాధ్యతలు అప్పగించింది. ఈ కోచ్ పదవి కోసం విదేశీ కోచ్‌లు స్టీఫెన్ కాన్‌స్టంటైన్, స్టీఫాన్ టర్కోవిచ్‌లు కూడా పోటీపడినప్పటికీ వీళ్లిద్దరిని వెనక్కినెట్టిన 48 ఏళ్ల జమీల్ భారత్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. 13 ఏళ్ల తర్వాత జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు స్వదేశీ కోచ్ శిక్షణ ఇవ్వనున్నారు.

చివరి సారిగా భారత్‌కే చెందిన సావియో మెడెరా 2011 నుంచి 2012 వరకు హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. తాజా నియామకంపై ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే మాట్లాడుతూ ‘ఐఎమ్ విజయన్ నేతృత్వంలోని టెక్నికల్ కమిటీ ముగ్గురితో కూడిన తుదిజాబితా నుంచి జమీల్‌ను ఎంపిక చేసింది. అయితే ఆయన పదవీ కాలాన్ని మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. జమీల్ మూడేళ్ల గడువును ఆశిస్తున్నారు. అయితే రెండేళ్లా లేదంటే మూడేళ్లా అనేది జట్టు ప్రదర్శన, ఆయన ఇచ్చే శిక్షణను బట్టి ఉంటుంది’ అని అన్నారు.

భారత మాజీ ఫుట్‌బాలర్ అయిన జమీల్ శిక్షణలో 2017లో ఐజ్వాల్ ఫుట్‌బాల్ క్లబ్ ‘ఐ-లీగ్’ టైటిల్‌ను సాధించింది. ప్రస్తుతం ఆయన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ కోచ్‌గా ఉన్నారు. అయితే భారత కోచ్‌గా నియమితులైన జమీల్ పూర్తిస్థాయిలో టీమిండియా కోచ్‌గా పనిచేయాల్సి ఉంటుందని ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు చౌబే స్పష్టం చేశారు. దీంతో ఐఎస్ఎల్ ఫ్రాంచైజీకి జమీల్ గుడ్‌బై చెప్పాల్సి ఉంది.

గత కోచ్ మార భారత జట్టు హెడ్ కోచ్‌గా ఉంటూనే, ఎఫ్‌సీ గోవా కోచ్‌గాను పనిచేశారు. స్పెయిన్‌కు చెందిన మనోలో గత నెల కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. టీమిండియా గత కొంతకాలంగా తక్కువ ర్యాంకు జట్లతోనూ ఓడిపోతుండటంతో ఇంకో ఏడాది పదవీకాలం మిగిలిండగానే కోచ్ తన పదవికి రాజీనామా చేశారు.